నరసింహశాస్త్రి, చింతలపల్లి

మలయవతి

చెన్నపురి, 1915

Record no. 697

Narasiṃhaśāstri, Cintalapalli

Malayavati

Cennapuri, 1915

Record no. 697

Bibliographic Record Target

నరసింహశాస్త్రి, చింతలపల్లి.

మలయవతి / ఇది చింతలపల్లి నరసింహశాస్త్రిచే రచింపఁబడినది.- చెన్నపురి: సదానందనిలయముద్రాక్షరశాల, 1915.

80 p. ;18 cm.

Record no. 697

Narasiṃhaśāstri, Cintalapalli.

Malayavati / idi Cintalapalli Narasiṃhaśāstricē racimpam̐baḍinadi.- Cennapuri : Sadānandanilayamudrākṣaraśāla, 1915.

80 p. ;18 cm.

Record no. 697

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB Date filming began:

శ్రీరామస్సహాయోఽస్తు.

మేధాదక్షిణామూర్తిః ప్రసీదతు.

మ ల య వ తి.

ఇది,

నెల్లూరుజిల్లా, కనిగిరితాలూకా, వేంకటగిరిసంస్థాన
మునకు చేరిన చిర్లదిన్నెగ్రామవాస్తవ్యుఁడును, ప్రకృతము,
బళ్లారి, మునిసిపల్ హైస్కూలులో
ఆంధ్రపండితుఁడునగు

చింతలపల్లి, నరసింహశాస్త్రిచే

రచింపఁబడి

చెన్నపురి :
సదానందనిలయముద్రాక్షరశాలయందు
ముద్రించి
ప్రకటింపఁబడియె.

౧౯౧౪.

Price, As. 6.]

C. RAMALINGA REDDY.

శ్రీరామస్సహాయోఽస్తు.

శ్రీమేధాదక్షిణామూర్తిః ప్రసీదతు.

మ ల య వ తి.

క. శ్రీవిద్యాలయు మునిసం
భావితు గురుమూర్తి మానవర్ణితతత్త్వున్
దేవాదిదేవవినుతు
న్భావించెదఁ బ్రోవ దక్షిణామూర్తి మదిన్. ౧

క. నుతియింతు సుగుణధామున్
వితతమహాశబ్దశాస్త్రవేత్తను విద్వ
న్నుతుఁ గాళహస్తిరాట్స
త్కృతు మద్గురుని నరసింహధీమంతు మదిన్. ౨

శ్రీమద్విద్యాధరలోకం బేలు జీమూతకేతుండను నొక యొడయండు గలండు. అతండు సుగుణాలవాలుండు, సూనృతవచనుండు, ప్రజానురంజకుండును నై ప్రజలఁ దాఁ గన్నబిడ్డలమాడ్కి నరయుచు నెఱిఁ దప్పక సాధువర్తనుం డయి ప్రజాపాలనం బొనర్చుచుండె. ఆతని యేలుబడిని బ్రజలు లాఁతివిలాతిపతులభీతి యిసుమంతయే నెఱుంగక హాయిగ నెదలపైఁ జేతులు వైచికొని సుఖనిద్రం గాంచెడివారు. అతం డన్న దుర్మార్గులకుఁ దల కంటగించుచుండు. దయాళుం డయ్యుఁ బ్రజలహితంబుఁ గోరి నెట్టకేలకు దండం

బుఁ దాల్చుచుండు. తాను బ్రజలవలనం గొను పన్ను స్వోపయోగంబు చేసికొనక సకలజనోపయుక్తంబు లగు పనులకే వినియోగించుచుండు. కఠినపుమాట లాడవలె నన్నను, గఠినశిక్ష విధింపవలయు నన్నను నాతని కెంతయు దుర్భరము గానుండును. ప్రజలు కొంకు మాని తండ్రికిం బోలెఁ దమకష్టసుఖముల నాతనికి నివేదించుకొందురు. చెప్పుకొన్న మనవులఁ జిత్తగించి న్యాయ్యంబుగ వారివివాదంబులఁ బరిష్కరించును. మాలకరి పువ్వులఁ గోయుచందమున జనులవలనం గప్పములం గొనుచుండుంగాని పరుసందనం బేనాఁడేనిఁ జూపఁడాయెను. ఆతనిపాలనంబున జూదరులకుఁ, గొండెగాండ్రకుఁ, దస్కరులకును, బందికాండ్రకు, మోసగాండ్రకును, స్వామిద్రోహులకును, గృతఘ్నులకును దక్కం దక్కిన వారికి నేమిటం గొఱంత లేక సుఖం బపారంబైయుండె. వెయ్యేల! ఆతనిరాజ్యంబున సుఖం బనుభవింపనివాఁడు మందునకయినం గానరాఁడు. తఱితో జీతము లిచ్చువాఁడగుటం జేసి స్వామికార్యం బన్న సేవకులు ప్రాణములకైనను వెనుదీయకయుండిరి. ఇట్లా జీమూతకేతువు సకలజనానురంజకంబుగ నప్రతిహతంబుగఁ జిరకాలంబు రాజ్యభారంబు వహించి సమస్తసుఖంబుల ననుభవించి యొక్కనాఁడు తన మనంబున నిట్లని వితర్కింపఁ దొడంగె.

"ఆహా! ఈ ప్రపంచసుఖంబు లెల్ల విషాక్తఫలంబులు. ఎయ్యది గన్నం దాత్కాలికసుఖదంబు గాని శాశ్వతసుఖ

దం బొందునుం గానము. శాశ్వతసుఖదంబు నిశ్శ్రేయసంబు. నిశ్శ్రేయసంబు కరంబు జ్ఞానసాధ్యంబు గాని వేఱొకంట నలవడునది గాదు. జ్ఞానం బూరక దొరకునే? ఇంద్రియంబుల నాఁగి, మనం బరికట్టి, పవనంబుం బంధించి, ప్రకృష్టతపశ్చరణంబున సాధింప నగు. అట్టి ప్రకృష్టతపంబు నాబోటి నిర్భరరాజ్యభారనిర్వహణచింతాకులస్వాంతునకు ననుష్ఠింప సాధ్యంబే? రాజు లేడ? వ్యపగతచింతాభరంబగు మనం బేడ? ఆశ దొఱంగినం గదా మనంబు వ్యపగతచింతాభరం బగును. రాజుల కేనాఁడేని యాశ నాశంబగునే? అది నాశంబు నొందిన వాసిఁ గనఁడే? ఈ యెడ స్మృతులును "అసంతుష్టో ద్విజో నష్టః సంతుష్టా ఇవ పార్థివాః" అని యైకకంఠ్యముం బొందియున్నవి. రాజు లాశం బాయఁగూడదఁట. బ్రాహ్మణు లాశం బాయవలయునఁట. అరయ నాశాపాశం బెవ్వరికైనను యమపాశంబ. ఆశను గోసినాతండు గాసిం బొందక సుఖించుఁగాదే! ఆశ కంతము లేదు. మేని బలం బుడిగినను నాశాబలం బుడుగదు. ఈ దురాశావేశంబునం గాదె యెందఱో భూమీశులు గడుఁ గాసిం జెంది తుదకు నాశంబుఁ బొందిరి. లోకసంగ్రహంబుకొఱకుఁ గర్మమునాచరించుట పరమధర్మంబు గానఁ దనకుంగాక జనులకై ధన మార్జింపవలయునని యాస్మృతి కర్థ మని [illegible]ఁచుచున్నది. తొల్లి జనకుఁడు లోనగు రాజర్షులులో నాశ లేనివారలయ్యు వెలికి నాశగలవారలు వోలె నటించుచు రాజ్యభారంబు వహిం

చుచు వచ్చిరి. నే నేల యింకను రాజ్యభారంబుఁ బూనవలయును. ఇంకను భౌతికసుఖంబుల నాశపడవలెను. ఎన్నిదినములు ప్రయాసపడినను వ్యర్థాయాసంబ గాని వేఱొండు లేదు. ఈ రాజ్యసుఖంబు లన్నియు మరుమరీచికానీకాశంబులు. బుద్బుదప్రతిమంబులు. ఆకాశనగరీనీకాశంబులు. ప్రాజ్ఞుండు వీనికై ప్రయాసము పడఁడు. భౌతికసుఖంబుల నెల్ల ననుభవించితి. ఇఁక నేల యీ కష్టములపాలు కావలెను. దొరతనంబునం గల కష్టము లిన్నియని చెప్పనలవియే? అక్కటిక మింత యేని మనంబున నిడక యొరులు నొవ్వ దండంబుఁ దాల్పవలెను. మాంసంబు పక్షు లెట్లట్లు రాజ్యంబును జెక్కం ద్రపేక్షించి రంధ్రాన్వేషణంబు చేయుచు నించుక ప్రమాదంబు చొరసినఁ వాత వేసికొనఁ గాచికొనియుందురు. అట్టివారికి నెడ మియ్యక మెలంకువ మీఱి మెలఁగవలయు. మిత్రారులఁ గరంబు నిపుణంబుగ నారసి పగతు సెలుముల న్నెరపం దగు. లాఁతులడెందంబు కందకుండ మాలాకారుఁడు పువ్వులఁ గోయుచందమునఁ బన్ను గ్రహింపవలయును. రాజునకుఁ బ్రజానురంజనంబు ముఖ్యంబు. ప్రజానురాగంబుఁ బడయఁడేని రాజు సుఖంబుఁ గాంచఁ డండ్రు. ప్రజానురాగంబుఁ బడయుటకు వారియోగక్షేమంబుల నారయుట, పరరాజులభీతి మాన్పి కాపాడుట, దయ తోఁప వారిమనవుల నాలకించి తగినచందంబునఁ బొం దొనరింపించుట మొదలగునవి సాధనంబులు.

అందు ముఖ్యసాధనంబు పరరాజభీతి మాన్పి కాపాడుట. పరరాజుల పీఁచ మణఁపమేని లోకం బాకులత నొందఁ బ్రజాపీడనంబు గావించుచుందురు. లాఁతివిలాతిపతులభీతి మాన్పుట యన సులభంబే? ధైర్యోత్సాహంబులును, సప్తాంగంబులును గలిగినంగాని సాధ్యంబు గాదు. ఒకనితోఁ బగగొన్నవానికి మనంబు చొప్పడియుండునే? కంటికి నిద్దుర పట్టునే? తఱివేచి యెప్పుడు పైఁబడునో యను వెఱపున నప్రమత్తుండై కంటిపై ఱెప్ప వేయక యెల్లప్పుడు పరరాష్ట్రచింతయె పనిగా నుండవలయు. ఇట్లు చింతాసాగరమగ్నుండయినవానికి సుఖం బన్న సున్న. సుఖహీనంబైన రాజ్యం బేలిన లాభం బేమి? దేన సుఖంబు గల్గు, దాని నార్జింపవలయు. మోక్షంబునం గాక మఱి దేన సుఖంబు గలదు. కాన—నే మోక్షంబునకై కడంగెద. రాజ్యంబుం దొలంగెద. నీతికోవిదుండును, సత్యశౌచాదిగుణనిధియు, సదాచారపరాయణుండును, సన్మార్గవర్తియు నగునాకొమారునకు జీమూతవాహునకు రాజ్యంబు గట్టి యేఁ గానకుం జని వానప్రస్థవిధిం గాలంబు గడుపుచు, మునులవలన మోక్షధర్మంబుల నెఱుఁగుచు విశ్రాంతిసుఖం బనుభవింతుఁగాక. “రాజ్యాంతే నరకం ధ్రువం” అనునట్లు తుదకు నీరాజ్యంబున నరకప్రాప్తి తప్ప మఱియేమియు లేదు. జాగు సేయఁదగదు. నాకు నేండ్లు చెల్లినవి. జరాభారంబు పైఁబడె. మేన బలం బుడిగె. దృష్టిపాటవంబు దొలఁగె. శరీరాయాసంబు

ప్రబలుచున్నది. చిత్తము చాంచల్యాయత్తము గాఁ దొడంగె. బుద్ధికిఁ జాకచక్యంబు తప్పుచు వచ్చె. ఇంకఁ గాలంబుఁ బుచ్చుట తగదు. ఎన్నిదినంబు లేలినను దాత్కాలికసుఖంబు గల్గును గాని యాత్యంతికసుఖంబు గల్గునే?" అని డెందంబునం దలపోసి ప్రాపంచసుఖంబుపై నాశను గోసి పారమార్థికసుఖంబు గోనఁ బుత్రునికి రాజ్యంబు గట్ట మంత్రుల నియోగించి భార్యాసమేతుఁడై యడవికిం జనియె.

అంత రాజానుమతిని మంత్రులు జీమూతవాహనునకుఁ బట్టంబు గట్ట సమకట్టిరి. కాని జీమూతవాహనుండు తండ్రి యడవి నుండఁ దాఁ బట్టణంబున నుండి రాజ్యంబు నేల సమ్మతింపక యెట్టకేలకు మంత్రినిర్బోధమున రాజ్యంబు నేల నియ్యకొనియెను. ఇయ్యకొని తండ్రికంటె నినుమడిగఁ బ్రజానురాగంబు వడసి, మంత్రిప్రభృతిప్రకృతివర్గంబునకుఁ గడుం బ్రియతముండై రాచకార్యంబులఁ బ్రమత్తుండు గాక మెలంకువ మీఱ మెలంగుచుఁ, జారముఖంబునఁ బరరాష్ట్రవృత్తాంతముఁ గరతలామలకంబుగ నెఱుంగుచు, యుక్తదండంబు విధించుచు, నెవ్వరికి నహితుండుగాక మైత్రి నెఱపుచు, శూరలోకంబు గొనియాడఁ బగఱ నుక్కడంచుచుఁ, దనయాజ్ఞ నందఱు ప్రియంబున నౌదలఁ బూన నప్రతిహతంబుగ రాజ్యం బేలుచు మహాసుఖం బనుభవించుచున్నను దండ్రిని బాసినకతంబున నాసుఖంబు లన్నియు నాతని కింపుఁ బెంపవాయె. ప్రాణంబు లన్నియుఁ దండ్రిపై నిడికొని

బొందిమాత్రంబు నిచ్చట నునిచికొని యెట్లో కొంతకాలం బతికష్టంబుగఁ దండ్రియాజ్ఞ మీఱరా దనుసదభిప్రాయంబున రాజ్యంబు పాలించుచు నొక్కనాడు—

"అక్కటా! నన్నుఁ గన్నతండ్రి యడవిని నెటు కష్టపడుచున్నాఁడో? శీతవాతాతపంబుల నేగతి నోర్చునో? ఎండ యెట్టిదో యెఱుంగని యాదేహం బచిరకాలంబున నావనవాసాయాసంబునకు నలవాటుపడెనే? మణికుట్టిమంబుల నేని యడుగిడ వెఱచు నాతండ్రి కఱకుఱాల నేగతి సంచరించునో? వేళ యతిక్రమింపక షడ్రసోపేతంబులగు మధురాహారంబులను వరవుడు లాయితంబుగావించికొని కొని తేర భుజించునాయనుంగుఁదాత యిప్పు డేగతి నడవులఁ గ్రుమ్మరి కందమూలఫలంబుల నేరికొని వచ్చి భుజించుచున్నవాఁడో? సితవితానపరిశోభితం బైనహంసతూలికాతల్పంబుల సేవకులు పాదసంవాహనంబు సేయ సుఖనిద్ర గనునాప్రియజనకుం డటవిని నిమ్నోన్నతస్థలంబుల నెట్లు శయనించునో? దోవతుల నెవ్వ రుదికి తెచ్చియిత్తురో? దేవతార్చనకుం గుసుమంబుల నెవ్వఁ డొసంగునో? గంధ మెవ్వరు దీసి యిత్తురో? నాయనుంగుఁదండ్రి నన్నుఁ గనుటవలని లాభం బేమి? దేనికై తలిదండ్రులు పుత్రులం బడయఁగోరుదురో వారు దానికిం గొఱ గారేని తలిదండ్రుల కాపుత్రులవలన లాభం బేమి? ముప్పునఁ దలిదండ్రులఁ గాపాడలేని కొమారుని పుట్టువు నిరర్థకంబుగాదే! చిఱుతతనంబునఁ గన్నకష్టములఁ

బడి ప్రోది సేసిన జననీజనకులకుం గానికొమరుండు కొమరుం
డే? ఆహా! ననుఁ బడయ వేడి యెన్ని కష్టములం గుడిచిరో?
ఎందఱు వేల్పులకు మ్రొక్కిరో? ఎందఱు మునిపాదంబులఁ
గడిగిరో? ఎందఱు దంపతులకుఁ బూజ లొనర్చిరో? ఎంద
ఱనవనీసురుల నారాధించిరో? ఎన్ని వ్రతముల నాచరించిరో?
పంగ్వంధబధిరుల కెందఱికి వస్త్రాన్నదానంబుల నొసంగిరో?
ఇన్ని కష్టములం బడి, ననుఁ బడసినను నావలన నించుకైనను
బ్రయోజనంబుం బడయరైరి. గురుజనశుశ్రూషావిరహి
తుండనైన నాజన్న మేల? తలిదండ్రు లిట్లు వనభూముల నిడు
ములం గుడుచుచుండ నే నిట్లు పత్తనంబున రాజ్యసుఖంబుల
ననుభవింప లోకంబులోనివారు నన్నే మని యందురు?
నాసుఖం బొకసుఖం బగునే? నాబ్రతు కొకబ్రతు కగునే?
ఎందఱు పరిజను లున్న నేమి? ఎందఱు మంత్రు లున్న
నేమి? పరోపకారధురీణుండును, పరపీడాజిహీర్షాపరాయణుం
డును, అపారకృపాపూరపరిపూర్ణహృదయుండును నగు
నా జనకుండు లేమిం జేసి యీ నా నగరంబు శశివిహీనంబైన
నిశచందమున, కమలములు లేనికమలాకరంబునడువున,
పతివిరహిత యగుసతిమాడ్కి, దయాశూన్యం బైనరూ
పంబుభంగి నేమియు నింపుఁ బెంపకయున్నది. రాజ్య
సుఖంబుకంటె గురుచరణశుశ్రూషయె నాకు సుఖదంబుగ
నున్నది. నేను నారాజ్యము మంత్రులపై నిడి తండ్రియున్న
యడవులకుఁ బోయి తల్లిదండ్రులకు వనవాసాయాసక్లేశంబు

తోఁపకుండఁ బరిచర్య యొనర్చుచు నాధ్యాత్మ విషయం
బులఁ దెలిసికొనుచు సుఖంబుగఁ గాలంబు గడపెదను. జన
నీజనకులపరిచర్య రాజ్యం బేలుట గాదే! నాయనకు ము
దంబు సంపాదించుట ప్రజల సంతోషపెట్టుటగాదే? నా
ప్రియజనకుఁడు లేమిని నేఁ బట్టణంబున నున్నను నడవిని
నున్నయట్టే! అడవిని నున్నను నాప్రియజనకునికడ నుందు
నేని నగరంబున నున్నయట్టు సంతసంబు గొల్పెడి. గురు
జనశుశ్రూషావిరహితుండనై యిఁక నే నిందు నిలువఁజా
లను. వారితోడి యునికియ నాకు స్వర్గతుల్యంబు. ఇఁక నిం
దొక నిముసం బేనియు నుండ" నని విరక్తిం జెంది, యుపధా
శుద్ధులును, విస్రంభపాత్రులును, స్వామికార్యతత్పరులును,
నీతిశాస్త్రపరిజ్ఞాతలును నగుమంత్రులకుఁ దనరాజ్యం బొప్ప
గించి రాజచిహ్నంబుల నెల్లఁ బుచ్చివైచి జనసామాన్యంబు
నకుఁ దగు వస్త్రంబుల ధరించి తనయాప్తమిత్రుఁడగు నాత్రే
యునితోడఁ దండ్రి యున్నయడవికిఁ బయనమాయెను.

"కదలి జీమూతవాహనుండు కతిపయప్రయాణంబులఁ
దండ్రియున్న యడవికిం జని తల్లిదండ్రులున్నచోటారసి—
వారలం గని వినయవినమితగాత్రుండై సాష్టాంగం బెఱఁగ
నా తల్లిదండ్రు లానందసాగరమగ్నులై క్రుచ్చియెత్తి గాఁగి
లించుకొని, శిరంబు మూర్కొని, చుంచు దువ్వుచు నిట్లనిరి.
నాయనా! రాజ్యంబును బాసి యడవుల కేతేర నేల సాహ
సించితివి? రాజ్యంబునఁ బ్రజలు సుఖంబునం బొదలెదరె?

ఈతిబాధలు లేవు గదా? జనుల కనురక్తుండవై మెలంగుదువే? భృత్యులు ప్రియంబునఁ బనులు సల్పుదురే? ఉన్నయట్టు లుండి యిట వచ్చుటకుం గారణం బేమి? పరులు రాజ్యంబు నాక్రమింపరుగదా? మంత్రులతోడఁ గూడిమాడి మెలంగుదువే? ఈ కఱకుఱాల నెట్లొక్కండవు నడచివచ్చితి. పరిజను లెవ్వరు లేరైరిగా? రథం బెక్కి రాక యిటు పాదచారివై యేల వచ్చితివి? ఎండ దాఁకి వాఁడిన నీమోము చూడఁ బ్రభాతచంద్రునిం జూచినట్లున్నది. చిన్నవోయిన నీకన్నులు సాయంసమయకమలంబులం బోలియున్నవి. చిగురాకుల వలె నతిమృదువు లైనయడుగు లెండచేఁ బొక్కలెగిరినవి. తండ్రీ! ఎంత దవ్వు వచ్చితి. పుత్రా! నీమే నేల కృశించియున్నది? విగతరాజ్యచిహ్నుండవై వచ్చినకతం బేమి? నీరాక చూడ నేదియో యొక విశేషం బుండు నని తోఁచుచున్నది" అని మేను నివురుచుఁ జెక్కులు ముద్దిడుచుఁ జిబుకంబు నంటుచు, దయ తనుపార, పుత్రవాత్సల్యం బేపార, గ్రుచ్చి గ్రుచ్చి యడుగ జీమూతవాహనుండు తండ్రి కిట్లనియె--

నాయనా! నీయేలుదేశంబునఁ బ్రజలకుం గుశలం బావంతయేని గొఱంత లేదన నాకుం గుశలంబె యని యడుగ నేల? సత్యశౌచాదులకు నెలవైన నీ దేశంబున నీతిబాధలు గలుగునే? నీచే శిక్షితులగు జనులకు రాజునెడ ననురాగంబు లేకయుండునే? భవదుపకృతిఁ బొందినభృత్యులు నీపుత్రునియందుఁ గృతజ్ఞులు గాకయుందురే? అజాతశ

త్రుండవైననీకు శత్రువు లుండినంగదా నీపుత్రునికి శత్రువు లుందురు. భవత్సుగుణంబుల కెల్లరు వశులై యుండ నిఁక నేరు మనరాజ్యంబుపైఁ జూ పిడువారు. భవదీయరాజ్యంబునం గలప్రజల కెల్ల మీరు తమ్ముఁ బాసితి రను కొఱంత దక్క వేఱొండు గొఱంత లేదు. భవద్రక్షితజనంబులకే భవద్వియోగంబు దుస్సహంబై యుండ నా కడుగవలయునా? దురంతసంతాపంబు గల్పించుచున్నది. నాయనా! నాయనుంగుఁదండ్రీ! నన్నొంటిఁ జేసి యిటులు వచ్చితిరి. మీ రడవుల నుండ నాకు రాజ్యంబున నుండ మనం బెట్లొప్పు? భవచ్ఛుశ్రూషావిరహితుండనైన నాకు రాజ్యంబు సుఖదంబగునే? కంటికి నిదుర పట్టునే? నోటి కాహారము పోవునే? మీరు లేక నాకు రాజ్యం బేల? మీరు లేక రాజ్యంబు గాదు గదా త్రిలోకాధిపత్యంబును నానందం బొదవించునే? నందనోద్యానంబైన సంతోషావహంబగునే? మిమ్ముల విడిచి నే నొంటిగ నుండఁజాలను. మీరు పట్టణంబునకు వచ్చి యథాపూర్వంబుగా రాజ్యం బేలుచుండిన నేఁ బట్టణంబున నుండువాఁడ; లేదేని మీతోడ నిందే మీశుశ్రూష చేసికొనుచు సుఖంబుగ నుండెదను. మీకడ నుంటకంటె నాకు మేలెయ్యది? మీ కష్టసుఖంబులకుం గానేని నే నుంటవలని ప్రయోజనం బేమి? మీతోడిద లోకంబు. మీ కుపచా గావించుపనికంటె వేఱుపని యెయ్యది?" అని యనివార్యప్రతిజ్ఞుండై చెప్పఁ దండ్రి యిట్లనియె—

"నాయనా! జీమూతవాహనా! బాలుఁడవు. ఏమియు నెఱుంగవు. వనవాసంబు గడుసుఖం బని తలంచితివి కాఁబోలు. వనవాసం బెంతయు నాయాసావాసంబు. ఇందుండి నీవు చేయున దేమున్నది. నీగుణసంపత్తిచేతను, నీవినయవివేకంబుల, సత్ప్రవర్తనంబుల, సాధుజనసాంగత్యంబున, సచ్చింతాపరాయణత్వంబున, సత్పరిపాలనాపటిష్ఠత్వంబున మే ముపచరితుల మైతిమి. నీ విందుండి మాపరిచర్య చేయుచుండుటకంటెను బత్తనంబున నుండి రాజ్యం బేలుచుండుటయే మాకు పరమసమ్మతంబు. విషయానుభవంబుచేఁ బరిపక్వమానసులకు వనవాసంబు యోగ్యంబు. కాని నవయౌవనకషాయితాత్ములకు భవాదృశులకు యోగ్యంబు గాదు. నవయౌవనకషాయితాత్ములమానసంబుల నధ్యాత్మవిద్య చొఱ నేరదు. అధ్యాత్మవిద్యఁ బడయఁ దలఁచి కాదే మును లిందుండువారు. అధ్యాత్మవిద్యఁ బడయ నీ కిది యదను కాదు. సోపానక్రమంబున మొదలింటిబ్రహ్మచర్యగార్హస్థ్యంబుల నడిపి యావలివానప్రస్థాశ్రమంబు నాఁబరగు నీవనవాసంబు సేయందగు. బ్రహ్మచర్యాశ్రమంబు నడపినాఁడవు. ఇఁక లక్షణవతి యగు నొక కన్నెం బెండ్లియాడి గార్హస్థ్యంబు నడపవలసియున్నది. గార్హస్థ్యం బాశ్రమంబులలో నెల్ల నుత్తమం బగు. గృహస్థుండే యితరాశ్రమంబులవారికిం జీవగఱ్ఱ. గృహస్థుండు జ్యోతిష్టోమాది

యజ్ఞంబులఁ జేయుటంబట్టికదా యింద్రుండు సంతసించి వర్షంబు గురిపించెను. గృహస్థుండు పంగ్వంధబధిరకుబ్జాదులకుం గల్పవృక్షంబు. ఆతిథ్యభ్యాగతులకుం గామధేనువు. సత్కర్మలతలకు నాలవాలంబు. సదాచారవృక్షంబునకు మూలంబు. పుణ్యజలధులకు ప్రపదంబు. పంచయజ్ఞతత్పరుండై నిష్ఠమెయిఁ బ్రమాదంబుఁ బొరయక గార్హస్థ్యంబు నడుపుమనుజునకుఁ బడయరాని దెయ్యదియు నుండదు. వానికి మోక్షంబును సుఖసాధ్యంబై యుండు. గార్హస్థ్యంబున మనఃపరిపాకం బలవడి విషయానుభవంబునఁ బ్రపంచవిషయంబులనిత్యానిత్యతలవివేకంబు చక్కఁగ సిద్ధించు. వైరాగ్యంబు త్రోవ దొరకొను. సమస్తాపేక్షానుభవంబున సుఖాపేక్ష యణంగు. ఇట్లు చిత్తవికారసమాకర్షియు, మోక్షమార్గసందర్శియు నగు గృహస్థాశ్రమంబు విడనాడ నీ కుచితంబు గాదు. కొన్నిదినంబులు గృహస్థాశ్రమంబు నడపి పదంపడి యిట వత్తువు. నా చెప్పినమాట విని యీ కష్టోద్యమంబునుండి మరలి గృహంబున కరిగి యథాపూర్వంబుగ రాజ్యం బేలుము. గృహస్థాశ్రమంబు నడుపుము. నిన్నును నన్నును బాసి విద్యాధరలోకం బింత కెంత కుందుచున్నదో? నానిమిత్త మెంత దవ్వు వచ్చితివి! కఱకుఱాల నెటు నడచితివి. నాయనా! జీమూతవాహనా! ననుఁ బాసినకతంబున నెంత కృశించితివి. పొమ్ము." అన జీమూతవాహనుండు వినయంబును, ఖేదంబును దోఁపఁ జేతులు

దోయిలించి "నాయనా! నీచెప్పినచొప్పంతయు నిజంబు. వనవాసక్లేశంబు నే నెఱుంగనిది కాదు. మీచరణసపర్య వదలియుండుటకు నాకిష్టము లేదు. దీనికంటె నా కేదియు సుఖకరం బని తోఁపదు. మీ రెం దుందురో యదియే నాకు రాజ్యంబు. కని పెంచినవారి కీమాత్రం బుపచారంబు చేయఁ గూడదా! నాపై ననుగ్రహించి నాసేవ నంగీకరించి నన్నిట నుండ నీకొనవలయు"నని మఱి మఱి వేడుకొన జీమూతకేతుండు పొమ్మనఁ జాలక యెట్టకేలకు నాతని నట నుండుట కంగీకరించెను. అందే జీమూతవాహనుండు తండ్రికి వనవాసాయాసంబుఁ దోఁప నీక వల్కలంబుల నుదికి తెచ్చి యిచ్చుచు, కుశసమిత్తులఁ దెచ్చియిచ్చుచు, గంధమూలఫలంబులఁ గొని తెచ్చుచుఁ, దీర్ఘమాడఁ గొలనికిం దోడ్కొనిపోవుచు, దేవతార్చనకు వలయు కుసుమములను, గంధమును, ధూపదీపనైవేద్యంబులను సమకూర్చుచు, నిదురపట్టునంతకుఁ బాదసంవాహనం బొనర్చుచు, వీవనఁ జేఁ బూని విసరుచు, నెల్లవెంటలం దానయై తిరుగుచు, రాజ్యంబుఁ బాసితి నన్న దుఃఖం బించుకయేనియు మనంబున నుంచక యధికసంతోషంబునఁ దండ్రికి నుపచారంబులఁ గావించుచుఁ జిరకాలం బుండె.

అంత నొక్కనాఁడు తండ్రి జీమూతవాహనుం జూచి, నాయనా! చిరకాలముగ నిచ్చటనే యుండుటచే నీ యరణ్యంబునం గలకందమూలఫలంబు లన్నియు నయిపోయి

నవి. ఇఁక నిం దుండిన, శరీరయాత్ర నడచుట కడు దుష్కరంబు. ఎందేని చనుదము. ఒక్కెడం జూడుము. మునిజననివాసయోగ్యంబై పానావగాహంబులకు ననువు లగు కొలంకులం గలిగి పుష్పఫలభరితంబైనవనం బొండారయుము. మలయపర్వతప్రాంతకాంతారంబునఁ దపస్విజనయోగ్యంబైన ప్రదేశంబు గల దని విందు. అం దరిగి యారసి రమ్ము." అని చెప్ప,జీమూతవాహనుండు వల్లె యని తండ్రియాజ్ఞ నొదలఁ దాల్చి మిత్రుఁడగు నాత్రేయునితోడ మలయపర్వతప్రాంతకాంతారంబునకు నరిగి యందందు రమ్యప్రదేశంబులు వెదకుచుండ మిత్రుండగు నాత్రేయుం డిట్లనియె. "వయస్యా! ఎంతకాలం బిట్లీ ముసలిబడుగుల తోడ వనవాసదుఃఖ మనుభవించెదవు. వీరలుః కారు గదా? నిజముగా నీవే విరక్తుండవుగాఁ గన్పట్టుచున్నావు. ఏల యీ యెలప్రాయంబు నడవిపాలు చేసెదవు. ఇఁకనైన నా మాట విని యీ గురుశుశ్రూషానిర్బంధమును వదలించుకొని సుఖముగా రాజ్యభోగంబుల ననుభవించెదవు గాక. రమ్ము పోవుదము" అన జీమూతవాహనుం డిట్లనియె—ఆత్రేయా! నీచెప్పినచొప్పంతయు నుచితంబుగఁ దోఁపదు. చూడు. జనకుని ప్రోల నుండుటవలనం గలుగు సౌఖ్యంబు సింహాసనం బెక్కినఁ గలదే? తండ్రిపాదముల నొత్తుటవలని యానందంబునకు రాజ్యసుఖం బెనయె. ముల్లోకముల నేలినను దండ్రి యారగింప మిగిలిన యన్నంబు

గుడుచుటకు సరి రాదు. దుఃఖ మొంచుతక్కఁ దండ్రిని వద
లిన రాజ్యంబు సుఖం బొదవునే? అన నాత్రేయుండు
"ఆహా! ఏమి యీయనపితృభక్తి! ఏమి రాజ్యనైరపేక్ష్యము!,"
అని మనంబున నాలోచించి జీమూతవాహనునితో నిట్ల
నియె—అయ్యా! నేను రాజ్యసుఖమును మాత్ర ముద్దే
శించి చెప్పినవాఁడను గాను. నీవు చేయవలసిన పను లనే
కము లున్నవి. అందులకై యిటు చెప్పితి. అన జీమూత
వాహనుం డిట్లనియె. వయస్యా! చేయవలసిన దంతయుం
జేసినవాఁడ. ఇఁక నే నేమి చేయవలయును. నాదేశంబు
నం గలప్రజల నెల్ల సన్మార్గవర్తులం గావించితి. పెద్దల నెల్లం
నాసరివారిం జేసితి. తనివి తీర యాచకుల కొసంగితిని?
ఇఁక నేఁ జేయవలసిన దే మున్నది. చెప్పుము" అన నాత్రే
యుండు "నీ వేమియుఁ జేయవలసినది లేదా? ఆలోచించు
కొనుము. అఖర్వగర్వోదారుండైన మహాసాహసికుండు మా
తంగహాతకుండు ప్రబలశత్రువైయున్నాఁడు. వాఁ డున్నంత
కాలము నీరాజ్యము నిపుణతము లగుమంత్రులచేతులలో
నున్నను నిరపాయం బని తలఁపఁగూడదు. వానిం బోకా
ర్పఁ బ్రయత్నంబు చేయవలసియున్నది. నీయుద్యమం బెఱిం
గెనేని యిప్పుడ దాడివెడలును" అన జీమూతవాహనుం
డిట్లనియె. ఛీ మూర్ఖా! ఏమి చెప్పెదవు. మాతంగహాత
కుండు నారాజ్యం బపహరించుననియా భయపడెదవు. దీనికి
భీతిలనేల? ఆతఁడు రాజ్యం బపహరించిన నాకు మహోప

కారంబు చేసినవాఁడుగాని యపకారంబు చేసినవాఁడు
గాఁడు. రాజ్యము కాదుగదా నాశరీర మిమ్మన్నను నిచ్చు
టకు సిద్ధముగా నున్నాఁడను. శరీరము మొదలుగా సర్వమును
నేను బరులకొఱకే కాపాడుకొనుచున్నాను. "పరోపకా
రార్థమిదం శరీర" మన వినవే? రాజ్యంబు నేలువానికి
సుఖం బన్న సున్న. ఇంతమాత్రంబునకు నెవ రేలిన
నేమి? కొందఱు రాజ్యం బన్న నెంతో సంతోషపడియెదరు
గాని యందలికష్టంబులఁ దలంచిన నంతకంటెఁ గష్ట మగు
పని వేఱొండు లే దని నాకుఁ దోఁచుచున్నది. నారా
జ్యము నేనే మాతంగహాతకుని కేల యొసంగ నందు వేని
నాయనుంగుఁదాతకు నోడి యియ్యకున్నవాఁడ. తండ్రి
యాజ్ఞ మీఱ నా కిష్టము లేదు. నాకుఁ దలిదండ్రులే పర
దేవతలు. "న మాతుః పరదేవతా" "న గురోరధికం
నగురోరధికం శివశాసనత శ్శివశాసనతః" అని ధర్మశా
స్త్రంబు లుద్ఘోషించుచుండ లేదే? తండ్రియాజ్ఞ మీఱుట
కంటె వేఱొండుపాతకంబు లేదు. తండ్రిసపర్యకంటె వేఱు
పుణ్యంబు లేదు అని నాతలంపు. చెలికాఁడా! సల్లాప
ప్రసంగంబులఁ దండ్రియాజ్ఞ మఱచినాము. వాసయో
గ్యం బగునివాసంబు గనుగొందము గమ్ము" అని యచటు
వాసి యచ్చటచ్చటఁ దగిననెలవుల వెదకుచుఁ బోవుచుండ
నొక్కయెడ సుగంధిచందనగంధంబు మోసికొని సముత్తుం
గశిఖరపతితజర్ఝరితనిర్ఝరశీకరాసారంబు వహించి మెల్లమెల్లగ

పై బొలయు మే నెల్ల గగుర్పొడువ మలయపవనంబు వీచుటయు జీమూతవాహనుం డాత్రేయునితో నిట్లనియె.

నెచ్చెలీ! మలయపర్వతంబునకు వచ్చినారము. ఆహా! యేమి యీ పర్వతముయొక్క రామణీయకము. దిగ్గజంబులు తమచెక్కిళ్లు ఉద్దఁ బాలుగాఱు సీశ్రీగంధపుఁజెట్లందును గ్రందుకొని, కడలియలలతాఁకున రొద చేయు గుహలును, నెత్తమ్ముల నాడుసిద్ధోత్తమాంగనలపాదలాక్షారసంబుచేఁ గందినముత్తెములును డెందమున కమందానందముఁ గొల్పెడి. ఇందు వాసయోగ్యం బైనస్థలంబు నరయుదము. అని తాను ను నాత్రేయుండు ను మలయపర్వతం బెక్కి తగిననెలవు వెదకుచుండ, జీమూతవాహనునికుడిక న్నదురుటయు నాతం డాత్రేయునితో నిట్లనియె — నాకుడిక న్నదురుచున్నది. ఏమిది! నాకు దేనను నపేక్ష లేదు. నే నేమి ఫలంబుఁ బొంద నున్నాను! ఏమి శుభంబు రా నున్నదో యెఱుంగ" నన నాత్రేయుం డిట్లనియె. దక్షిణాక్షిస్పందంబు శుభోదర్కంబు. ఏల సందేహించెదవు. శీఘ్రంబు శుభంబు పొందెదవు. ఇటు చూడుము. ఈచెట్టు లెంత దట్టమై యున్నవో? ఇదిగో నిచట హోమద్రవ్యంబులగంధంబు వెదఁజల్లుచుఁ బొగలు గుప్పుగుప్పున లేచుచున్నవి. ఈలేడిపిల్ల లెంత నిర్భయముగాఁ బరుండి నెమరు వెట్టుచున్నవో చూడు. ఇది యొక తపోవనంబు గాఁబోలు.

అనవుడు జీమూతవాహనుండు "వయస్యా! నీచెప్పినది బాగుగ నున్నది. ఇది నిక్కంబుగఁ దపోవనంబె. అదిగో! మునిజనులు వేదములఁ బఠించుచుఁ, దదర్థంబుల విచారించుచు, సందేహంబుల నొకళ్లొకళ్ల నడిగికొనుచున్నారు. వటువులు పనసలు వల్లె వేయుచు సమిత్కుశఫలంబులఁ గోయుచున్నవారు. ఆహా! ఈతపోవనం బెంత సుఖప్రదం బై యున్నది. ఎంత మనోహరంబుగ నున్నది. ఈ తపోవనమందలిచెట్లును నెంత మర్యాద నెఱింగినవి. భ్రమరఝంకారంబుల నతిథుల స్వాగతం బడుగుచున్నవి. ఫలభారంబులఁ దలలు వాంచి కడుభక్తిని జోహా రొనర్చుచున్నవి. మరందబిందుసందోహంబున నర్ఘ్యపాద్యంబుల నొసంగెడి. అచేతనంబు లయ్యు నీవృక్షంబు లతిథిపూజ సల్పెడిని. ఇదె నివాసయోగ్యంబగుస్థలంబు. ఇందుండిన మనకు సుఖంబుగ నుండు నని తలంచెద. ఇందె జననీజనకులకు వాసయోగ్యం బైనపర్ణశాలం గావింతము. అనుచు నాయాశ్రమంబు ప్రవేశించిరి.

అట నంతకు ముందే గంధర్వరాజగు మిత్రావసువు కూఁతురు మలయవతి గౌరీదేవి నారాధింప వచ్చి సభక్తికంబుగ షోడశోపచారవిధిం బూజించి, పూజావసానంబున వీణాగానంబున గౌరి నలరింపఁ దలఁచి విపంచిక చేఁబూని చక్కఁగ మేళగించి శ్రుతిశుభంబుగ నాయాశ్రమంబునం గలలేళ్లు తినుచున్నమేఁతను వదలి మోము లటు

ద్రిప్పి చెవులు ఱిక్కించి కన్నులు మూసికొని వినుచుండ మొక్కలు చిగిరింప ఱాలు కఱఁగఁ బాములు పడగ లెత్తి యాడ నెమళులు పురులు విచ్చి నాట్యంబు లొనర్పఁ గాకలీప్రధానంబుగ వాయించుచుండె. ఆమృదుమధురవీణాగానంబు వీరిచెవులం బడుడు నాత్రేయుఁడు జీమూతవాహనునితో నిట్లనియె.

వయస్యా! ఈతపోవనములో నెవరో పాడుచున్నారు. వా రెవ్వరై యుందురు. అన జీమూతవాహనుండు కోమలంబు లగువ్రేళుల వాయింపఁబడుచున్న తంతు లెంత స్ఫుటముగాఁ బల్కుచున్నవి. కాకలీప్రధానంబుగ గానంబు జరుగుచున్నట్లు తోఁచుచున్నది. అదిగో చూడు. ఈ కోవెలయం దెవ్వతెయో యొకదివ్యకన్యక దేవతారాధనంబుకొఱకు వీణె వాయించుచున్నది. అన నాత్రేయుండు మన మక్కడకుఁ బోవుదము రమ్ము. దేవతారాధన మనకు ను శుభావహంబు. అన జీమూతవాహనుండు "మంచిమాట చెప్పితివి. అట్టె పోదము రమ్ము. దేవతాదర్శనం బేరికి శుభావహంబు గాదు?" అని యిద్దఱును గలసి పోవుచుఁ దటాలున నిలువఁబడి "మిత్రమా! స్త్రీ లేకతంబున నున్నచోటికిఁ బురుషులు పోరాదు. పోయిన నేమగునో? ఏమి ప్రమాదంబు ఘటిల్లునో? ఎటు పోయి యెటు వచ్చునో? పోకయుండుట య యుచితంబు. ఈతమాలవీధిని డాగి యాదివ్యగానం బాలింతము రమ్ము." అని చెప్పి

యాచెట్లచాటున డాగి గానము నాలించి వినుచుండిరి. ఆకోవెలయందు మలయవతి వీణియ మీటుచు "గౌరీ! గిరిరాట్కుమారీ! నేఁ గోరరానికోరికం గోరితి. ఈకోరిక యెట్లు కొనసాగఁగలదో యెఱుంగ. త్వదీయకరుణామృతసేకంబునఁ గాక నామనోరథాంకుర మంకురింప దని తలంతు. అమ్మా! ఇది యెట్లు నెరవేర్పఁ జెందించెదవో? అన్నిటికిని నిన్నే నమ్మియున్నదాన. నిన్నుఁ దక్క మఱొక్కవేల్పును నేఁ గొల్వ. నీట ముంచినం బాల ముంచిన నీవే గతి. దయచేసి నాయిచ్చునారతి గైకొనుము." అని పాడుచుండె. అది విని "ఆహా! యేమి యీగానమాధుర్యము. ఏమి వాద్యము" అని జీమూతవాహనుండు ను నాత్రేయుండు ను మనంబుల సంతోషించుచుండిరి. అఁట మలయవతిపరిచారిక మలయవతితో! "అమ్మా! మలయనతీ! చాలసేపునుండి వీణె వాయించుచున్నను నీవ్రేళ్లల నొవ్వకున్నవి" అని యడుగ, మలయవతి కోపముతో ఛీ! మూఢురాలా! యుక్తాయుక్త మెఱుంగనివట్టిగొడ్డా! దేవిమ్రోలనెంతసేపు వాయించిన నేమి! ఇంతసేపు కాదు గదా! ఇఁక నింతసేపు వాయించిన నేమి? నావ్రేళ్లకు నొవ్వేలపుట్టును" అని చెప్పెను. దానికిఁ బరిచారిక "అమ్మా! భర్తృదారికా! నిజము వక్కాణించెద. వినుము. చెవిటివాని ముందర శంఖ మూఁదినట్లు దయ లేనియీదేవిముందట నెంత వాయించిన నేమి ప్రయోజనంబు? నీపడినశ్రమ

యంతయు బూదిని ద్రేల్చినచందం బగుఁ గాని ప్రయోజనంబుఁ గనదు. కన్యకాజనానర్హం బైనయెన్నియో వ్రతములఁ జేసితివి. ఉపవాసముల నెన్నింటినో చేసితివి. అవి యన్నియుఁ బొల్ల యయ్యె! ఇంకను నీయమకు దయ గలుగదాయె." అని యనుచుండెను.

అత్రేయుం డది యాలకించి జీమూతవాహనా! వింటివా యా పరిచారికమాటలు. కన్యక యని చెప్పుచున్నది. కన్యక యయ్యెనేని మన మేల పోరాదు. పోవుదము రమ్ము. అన జీమూతవాహనుండు "సంగడీఁడా! ఏల పోయి చూడ రాదు? కన్యకలఁ జూచుట దోషావహంబు గాదు. అయిన నొక్కటి చెప్పెదను వినుము. క్రొత్తవారిని మనలం గని బాల్యస్వాభావికంబులగులజ్జాభయంబులచే నిట నిల్వక పోవు నేమో? ఆవల నీమృదుమధురగానంబు దొరకునే? ఇంకను నేమి మాటలాడుకొందురో యీచెట్ల మాటున డాగియే విందము." అని చెట్లచాటున డాగి వినుచుండిరి. అంత నాత్రేయుండు "ఆహా! వయస్యుఁడా! చూడు చూడు. ఆబిడ వీణావిజ్ఞానంబుచేత న కాదు. గానవిద్యకుం దగినయసమానలావణ్యముచేతను నానందం బొదవించుచున్నది. ఆహా! ఈమె యెవ్వతయై యుండనోపు. దేవవనితయా? లేక నాగకన్యకయా? అదియుం గాదేని విద్యాధరకన్యకయా? సిద్ధకన్యకయా? వీరిలో నొక్కర్తుక గాదేని నీయగణ్యలావణ్య ముండునే"? అన జీమూతవా

హనుండు "మిత్రమా! ఎవతెయో యీమోహనాంగి యెఱుకపడదు గాని దీనిఁ గాంచఁగలిగినవానిభాగ్యంబె భాగ్యంబు. ఈమె దేవవనిత యాయె నేని, ఆదేవేంద్రుని వేగన్నులు ధన్యము లగును. నాగకన్యక యయ్యెనేని బలిలోకంబున నీమెముఖంబె యనారతంబు వెన్నెలలు గాయుచుండం జంద్రునివలనం బ్రయోజనం బుండదు. మావిద్యాధరభామ యాయెనేని, మాజాతియదృష్టమే యదృష్టంబు. జాతులలో నెల్ల మాజాతి యతిగణ్యతం జెందె" అని యిరువు రనుకొనుచుండ నచటఁ బరిచారిక మలయవతితో "అమ్మా! నా చెప్పుమాట వినుము. నిర్దయురాలగునీయమ్మవారిముందర నెంత సేపు వాయించిన నేమి ప్రయోజనంబు. అలసితివి. ఊరక యుండుము. ఆవీణె నిటు తే" అని యావీణెను బట్టి లాగెను. పిమ్మట మలయవతి కుపితయై "ఇసీ! మూఢులారా! సకలలోకజనని యగు శర్వాణిని నిందించెదవు. భక్తిహీనుల ననుగ్రహింపదు గాని భక్తిగలవారి నెల్ల ననుగ్రహించుచునే యున్నది. ఇప్పుడే నాకు నమ్మవారు ప్రత్యక్షమై యనుగ్రహించినది. ఏమన వినుము చెప్పెదను. ఈప్రభాతమ్మున నే నిద్రించుతఱి స్వప్నంబునం బ్రణమిత గీర్వాణి యగునాశర్వాణి నాకట్టెదుటఁ బొడఁగట్టినది. అప్పుడు నేను విపంచి మీటుచు సంగీతచాతుర్యం బచ్చుపడఁ బాటలు వాడుచు స్తుతించుచుంటిని. అంత నాదేవి నాతో నిట్లనియె. అమ్మ వత్స!

మలయవతి! నీవీణాగానచాతుర్యంబునకు నే నెంతయు సంతసించితి. నీవలనం బ్రసన్నురాలనైతి. బాలికాజనదుస్తరంబైననీభక్తికిఁ గడు మెచ్చుకొంటిని. బాలికవయ్యు ననారతదృఢభక్తి సూపితివి! లేఁదీవమాడ్కి నతికోమలం బైన నీమేనతికష్టం బగుతపంబున నుపవాసంబుల వ్రతంబులఁ గడుఁ జెన్ను తఱిగియున్నది. తపం బుడుగుము. నీకోరిక లీరికలెత్త విద్యాధరచక్రవర్తి శీఘ్రముగ నీకు భర్త గాఁగలండు. అని దయ తోలుకాడఁ గారుణ్యామృతపూరపూర్ణాపాంగవిలోకనమ్ములఁ జూచుచు నుడివి యంతర్ధానంబు నొందె" అని చెప్పఁ బరిచారిక యటులైన నిది కల యని చెప్పనేల? నీ వభిలషించినవరంబు నీతపంబునకు మెచ్చి గౌరి యనుగ్రహించినది. ఇది సత్యం బని నమ్ము. అని చెప్పుచుండె.

ఆత్రేయుం డామాట విని జీమూతవాహనా! ఇదె యామెదర్శనంబు చేయ సమయంబు. పోవుదము రమ్ము. అన జీమూతవాహనుండు నే నిప్పుడె రాను. ఇంకను వీరేమి మాటలాడెదరో వినెదను. అన నాత్రేయుఁడు జీమూతవాహనుని కిష్టము లేకపోయినను చేయి పట్టుకొని లాగికొని యా మలయవతి యున్నగుడిలోఁ బ్రవేశించి "అమ్మా! మలయవతి! నీచేటి చెప్పినమాట తప్పదు. నిక్కంబుగ నమ్ము. అమ్మవారు నీకుం బ్రసాదించినది వరదానంబు గాని కల గాదు." అనెను.

అంత మలయవతి యపూర్వజనసందర్శనంబున నులికిపడి లేచి లజ్జాభయసంభ్రమంబులు ముప్పిరిగొన, జీమూతవాహనునిఁ జూచి "చేటీ! ఇతఁ డెవఁడే?" అనఁ జేటిక జీమూతవాహనునిఁ జక్కఁగఁ జూచి "భర్తృదారిక! గౌరి యనుగ్రహించినవరుం డీయసమానలావణ్యనిధి యైన మనోహరాంగుండు గానోపు నని నాకుఁ దోఁచుచున్నది. అన మలయవతి లజ్జాసాధ్వసంబులు డెందంబున మల్లడిగొన ననురాగం బుప్పతిల్ల నతికాంక్ష జీమూతవాహనునిఁ జూచుచు నంతకంతకు నెక్కు డగుసాధ్వసంబున నాతనియెదుట నిలువఁజాలక యపాంగవీక్షణంబునఁ జూచుచుఁ బరాఙ్ముఖియై నిలువంబడియుండె. అప్పుడు చేటి "భర్తృదారిక! ఏమిది! నోములపంట యైనయీనవమోహనాంగునిఁ గన్నులకఱవు దీఱఁ జూచుచుండక పెడమొగము పెట్టుకొనియున్నావు? అన నామలయవతి "చేటీ! నీ వేమో చెప్పెదవు గాని యీతనిమ్రోల నిల్వఁజాలక యున్నాను. ఆవలఁ బోదము రమ్ము." అని పోఁబోఁగా నాత్రేయుండు "ఆశ్రమమున కేతెంచినయతిథిని మాటమాత్రంబుచేతనైన నుపచరింపక యిటు లనాదరంబు చేయుట యాశ్రమవాసులగుమీకుఁ బాడి గాదు. ఇంటికి వచ్చినయతిథిని బూజించుట పరమధర్మంబు" అని చెప్పెను. పిమ్మట మలయవతిచేటిక యామెమనస్సు జీమూతవాహనునియందు లగ్నంబైనదనియు, అందుచే నీమెకిట్టిరాగోదయం బాయెననియు

నిది యింక నభివృద్ధిం జెందిన బాగుగ నుండు ననియు నెంచి మలయవతితో "అమ్మా! మలయవతీ! బాలుఁడు చెప్పినమాట నిక్కము. ఆశ్రమవాసులకు నతిథులు మిగులఁ బూజ్యులు. అతిథుల నిరాకరించిపోవుట మనబోంట్లకు శ్రేయోదాయకంబు గాదు. ఏవిధినైన వీరిఁ బూజింపవలయును. అతిథు లేతేర లేచి ప్రత్యుత్థానవిధుల సత్కరించుట నీకు ధర్మమైయుండఁగా నీ వీలాగు నివ్వెఱపడియున్నావు. నీవు చేయకపోయినను నేనైన మర్యాద యొనర్తుఁగాక" అని జీమూతవాహనునిఁ జూచి "అయ్యా! దయచేయుఁడు. ఈపీఠము నలంకరింతురు గాక. భవదీయపాదన్యాసంబుచే మాయాశ్రమంబు పవిత్రం బయ్యె. మేము ధన్యుల మయితిమి. భవదీయదర్శనంబుచే మానేత్రంబులు జన్మసాఫల్యంబు నొందె" అని యాదరించుచుండ మలయవతి "ఓసివెఱ్ఱిదానా! ఏమి తెలివి నీది. తండ్రితోడ నేని యాఁడువారేకతం బుండఁగూడ దన నపరిచితు లగువీరితోడ నొంటరిగా నిటులున్నఁ జూచినవారే మందురు. తాపసు లెవ్వరైన వత్తురు. వారు చూచిరేని నన్నయోగ్యురాలినిఁగా భావింతురు కాదే. ఇచటఁ దడ వుండఁ గూడదు. పోవుదము రమ్ము." అని చెప్పుచుండ గురువునాజ్ఞపై మలయవతిని బిలిచికొని పోవుటకై యొకతాపసుం డచ్చటికి వచ్చెను. అట్లేతెంచినయాఋషిని జూచి, జీమూతవాహనుండు ప్రత్యుత్థానం బొనర్ప నాసనంబునుండి లేవ ఋషి

"లేవవలదు. మా కెల్లరకు నభ్యాగతుండ వగునీవే పూజ్యుండవు. "అభ్యాగతః స్వయం విష్ణుః" అన వినలేదే? మాయాశ్రమంబునకు వచ్చిన మిమ్ముల మేము సత్కరింపవలయు. మీరు మమ్ము సత్కరింప నక్కఱ లే దని చెప్పి మలయవతి నమస్కరింప ననురూపుం డగుభర్తను బొందుమని యాశీర్వదించి కులపతు లగుకౌశికులవారు మాధ్యందినసవనమువేళ యతిక్రమించుచున్నది. నిన్ను సత్వరంబుగాఁ బిలిచికొని రమ్మని పంపఁగా వచ్చినాను. త్వరగాఁ బోవుదము రమ్ము. అని చెప్పి మలయవతిని చేటీసహితముగాఁ బిలిచికొనిపోయెను. గురువునాజ్ఞ మీఱఁజాలకయు, చిరకాలతపఃఫలంబైనమనోనాయకునిదర్శనంబు వదలిపోఁజాలకయు, మలయవతిడెందంబు వెనుకకును ముందరికిని డోలాందోళన మొందసాగెనుగాని గురునాజ్ఞ యవిలంఘ్యమగుటంజేసి యెట్టకేలకు మనంబు గట్టిచేసికొని నిట్టూర్పు నిగిడించుచు లజ్జారాగంబులు దోఁప నోరగంట జీమూతవాహనునిఁ జూచుచు నాతాపసుని వెంటఁ జేటియుఁ దానును వెడలిపోయిరి.

అంత జీమూతవాహనుండును నాత్రేయుండును మధ్యాహ్నం బగుడు నాస్థలమును బాసి త్రోవపొడువునను మలయవతివృత్తాంతమునే చెప్పికొనుచుఁ దమయాశ్రమము ప్రవేశించి తాము పోయిచూచివచ్చినయాశ్రమపుసంగతిని దండ్రికి నివేదించిరి. తండ్రియు మిగుల సంతసించి యా

మఱునాఁడు బయలువెడలి యందఱు నగ్నిహోత్రంబులతోడ నీగౌర్యాశ్రమంబు ప్రవేశించి యం దుచితస్థలంబున నొక్కయెడఁ బర్ణశాలం గావించికొని యందు నివసించుచుండిరి.

ఇట్లుండ నక్కడ మలయవతితండ్రి సిద్ధరాజు విశ్వావసువు మలయవతికి వివాహము చేయఁదలంచి తనకొడుకు మిత్రావసువున కిట్లనియె. మిత్రావసూ! నీచెల్లెలు మలయవతి సంప్రాప్తయౌవనయై యున్నది. ఇఁకఁ దడవు సేయఁదగదు. ఈఁడుజోడగువరునిం దెచ్చి వివాహంబు చేయవలయు. ఇచట జీమూతకేతుకుమారుఁడు జీమూతవాహనుఁడు మిగులఁ బ్రశస్తగుణుండు. విద్యాబుద్ధుల నసమానుండు. దయాశౌచాదుల కధిష్ఠానంబు. అతని కిచ్చి వివాహంబుచేసిన బాగుండు నని తోఁచుచున్నది. నీవు పోయి యతనితో మాటలాడి మలయవతిని గైకొనునటు లొడఁబఱచి రావలయును. ఆసంబంధము దొరకిన మనకులంబు పవిత్రంబు గాదె. పోయి రమ్ము. అని చెప్ప, మిత్రావసువును దండ్రియాజ్ఞ నౌదలఁ దాల్చి జీమూతవాహనుం డుండు నాశ్రమమునకుఁ బోవఁ బయనమాయెను.

అచట జీమూతవాహనుండు మలయవతిఁ గనినది మొదలాపైపై మనసు తగులుగొని మరునివిరిశరములకు గుఱియై నిలిచినచోటనే నిలుచుచుఁ జూచినదానినే చూచుచుఁ జేసినపనినే చేయుచుఁ జదివినదే చదువుచు, నాది

క్కునుండి గాలి వీచినను మలయవతి వచ్చుట గా దలంచి యులికిపడి లేచి బయల నవలోకించుచు మనసు నిలుపఁజాలకయు నొకరితోఁ జెప్పుకొనుటకు సిగ్గుపడుచు మదనవేదనాదోదూయమానమానసుం డగుచు నుండెను. దినములు గడుచుకొలంది మరుబాఱి యగ్గలంబగుడు నోర్వఁజాలక జీమూతవాహనుఁడు తనరహస్యము బయలుపఱుపక తప్ప దని నిశ్చయించి యాత్రేయునితోఁ దనమనోవ్యథకు మలయవతియే హేతు వనియు నామెకూటమిచేఁ గాని తాను మన్మథుని గెల్వఁజాల ననియుఁ జెప్పి యిద్దఱును బయలుదేఱి తొల్లి తాను మలయవతిని నెచ్చటఁ జూచెనో యాగౌర్యాశ్రమమున గౌరీగృహంబునకు వచ్చిరి. అంతకు ముందే మలయవతియు వలరాచవానికాఁకల మిగులం బొగిలి యావేదనకుం బారంబు గానక తననిమిత్తము జీమూతవాహనుని వేఁడుటకుఁ బోయినతనయన్న మిత్రావసువురాక కెదురుచూచియు నెంతకు రామిచే వలపుఁ బెల్లిదం బాపఁజాలక చిత్తవినోదంబునకుఁ జందనలతాగృహంబునకుఁ బోవ సమకట్టి యందలిమణివితర్దికను జక్కం జేయ నొకపరిచారికను ముందుగాఁ బంపి తాను ను ముఖ్యపరిచారికయు బయలుదేరిరి. కాని దా నెచ్చట జీమూతవాహనునిఁ జూచెనో యాస్థలమునే తనమనంబునఁ దలపోయుచుండుటచేత దారిపొడుగునను జీమూతవాహనునిరూపవిలాసంబులే మనంబునం దెన్నుచుఁ దా నెచటికిఁ బోయి విరహాపనో

దంబు గావింపవలెనో యాస్థలంబు నుఱచి గౌర్యాలయం
బునకు దారి చూపు మని తనపరిచారికతోఁ జెప్పెను.
పరిచారిక "చందనలతాగృహంబునకు బయలుదేఱిన
యీమె దేవళమునకు దారిచూపు మనుచున్న దేమి" అని
యాలోచించి యమ్మా, మనము చందనలతాగృహంబు
నకుఁ గదా బయలుదేఱినది. దేవళమునకు దారి చూప
మనెదవేమి? అని మందలించినను బెడదారిం బడి యా
దేవళమునకే పోవుచుండెను. పరిచారిక యీమెపరధ్యాన
మునకు నచ్చెరువొందుచు నేమమ్మా! ఈపరధ్యానమునఁ
జందనలతాగృహం బీకడనుండ నీకడఁ బోయెదవు. ఇదిగో
చందనలతాగృహంబు. ఇటుః రా. ఇందుఁ బోయి యీనెల
జాలతిన్నెపైఁ గూర్చుండి మార్గాయాసంబు నపనయించు
కొమ్ము. అని చెప్ప మలయవతి తనపరిచారికతోడ నాతిన్నెపైఁ
గూర్చుండి యున్న రనుచుఁ దనమనంబున నకటా! యెంత
సిగ్గుమాలినవాఁడు మన్మథుఁడు. తన్ను నెవరు రూపముచే
జయించిరో వారి మ్రోలకైనఁ బోవెఱచి యే నేర మెఱుఁగని
యబలలపైని బీరంబు చూపెడు. ఆహా! వీనిమగటిమి" అని
యనుకొనుచుఁ దనకుఁ జేసినయపరాధంబునకై మన్మథుని
దూఱుచుఁ దనచెలికత్తెతో నిసీ! యప్పటియీచందనగృ
హం బేల యిప్పుడు చలువలు వెదచల్లకున్నది. ఒక్కసూ
ర్యకిరణంబునకేని చొరనిరవు లేని యీయీఁగమ్ము నాసం
తాపం బేల యణఁపఁజాలకయున్నది. రాను రాను నాసం

తాపంబునకు మేర లేదు. ఏమిది యనఁ బరిచారిక తనకుఁ
గారణము దెలియు ననియుఁ దనమాట నామె నమ్మదు
గానఁ దాను జెప్ప ననియుఁ జెప్ప, మలయవతి తనగుట్టు
తనపరిచారిక యెఱింగినట్టున్నది. అడిగెదను అని "యేమె!
నీకుఁ దెలిసినకారణ మేమి? నీవు చెప్ప నమ్మని దే మున్నది?
వినెదను గాక. రవంత చెప్పుమా?" యని యడుగఁ బరిచా
రిక మేలంబునకై నీమనస్సులోనివరుఁడే నీసంతాపంబునకుఁ
గారణంబుకాక మఱి యెవ్వండు. అదుగో యాయన! అటు
చూడు. అన మలయవతి నిజముగా జీమూతవాహనుఁడు
వచ్చిన కా దలంచి సంతసంబును, దత్తరపాటును, అబ్బుర
మును ముప్పిరిగొన లేచి రెండుమూ డడుగులు నడచి
యేఁడీ యేఁడీ యాయన, యెక్కడ నెక్కడ, నని యడుగఁ,
బరిచారిక లేచి మందహాసంబు గావించి "భర్తృదారికా!
ఎవఁడే యాయన, అయనయెక్కడ నని యులికిపడి యడిగె
దవు" అన మలయవతి "అయ్యో! నే నెంతవెఱ్ఱిదానను.
నిజ మని మోసపోయితిని" అని లజ్జచేఁ దలవాంచి
బొటనవ్రేల నేల గీయుచుండెను. పరిచారిక "అమ్మా!
మలయవతీ! ఎవనిని గోరి యిన్నిదినంబులు తపశ్చరణం
బొనరించితివో యాతనినే ముదిత యగునీశ్వరదయిత ప్రసా
దించినది. వెంటనే యానవమోహనాంగుని నీవును బ్రత్య
క్షముగాఁ జూచితివి. ఆయనయె నీయతనుతాపంబునకు
మూలంబు. దానంజేసియే యతిశీతలం బగునీచందనలతా

కుంజంబును నీతాపం బాపఁ జాలకయున్నది." అని సత్యంబు చెప్ప, మలయవతి "ఈచతురిక నారహస్యం బెఱింగినది. ఇఁక దాపఱికంబుచేసినను బ్రయోజనంబు లేదు. సమ్ముఖమునకు వచ్చి రాయబారమేల? ఎటులయినను నామనోగతం బెఱింగింపకతీరదు" అని నిశ్చయించి సర్వమును దాఁపక పరిచారికతోఁ జెప్ప నదియు, "తొందరపడకు. సంతాపం బేల పొందెదవు. శీఘ్రంబుగ నాతనిసమాగమంబు సమకూర్చెదను. అతఁడు ను నీవలె మన్మథబాధం బొరయక యుండఁడు. ఇంతకు నాకంతుఁ డతనిని నెంత చేసియుండునో? ఎంతటిధీమంతుఁ డైనను కంతుకుంతములకు లోఁబడనివాఁడు లేఁడు. అతఁడును రేపో మాపో యిట వచ్చును. తొందరపడకుము. కొంచెము కాల మోర్చుకొనుము." అని ధైర్యము చెప్పెను. కాని మలయవతి కాతనిపేరు చెవిసోఁకినంతనె మదనానలం బగ్గలం బగుడు "నెచ్చెలీ! యేటిమాటలవి. నే నేడ? ఆతనిసంగమం బేడ? అంతటిభాగ్యంబు నాయట్టిమందభాగ్యకుం గల్గునే? నీ వూరక నను నూఱటం బొరయింప నోరికి వచ్చినట్టు పలికెదవు. ముల్లు తీసి కొఱ్ఱడఁచినట్టుల తదీయాలాపంబుల నను మఱింత గాఱియం బెట్టెదు. నీచెప్పినయాతం డిట వచ్చినప్పు డొకయుపచారవాక్యం బేని నాడ నైతి. ఆతిథ్యం బొసంగమి యటులుండఁ గూర్చుండు మని యైనం జెప్పనైతి. ఇట్టిమర్యాద యెఱుంగని నను సకలధర్మవేత్త యైన యావిద్యాధరచక్రవర్తి చేకొ

నునే? నాకు మనఃఖేదము పుట్టింప నోడి నీ విటు ప్రియంబె కాని చెప్పవు. ఆతనిసమాగమంబు నాకుఁ జేకూరు నని నే నమ్మ. నాప్రాణము నీచేతిలో నున్నది. ఏమి చేసెదవో?" అని నిట్టూర్పు పుచ్చి విచారపడసాగెను.

పరిచారిక మలయవతికి నాయతనుతాపం బాప నెన్నియో శైత్యోపచారంబులు చేసెను కాని, యవియన్నియు నిరర్థకంబులయి తాపం బణఁపఁజాల వయ్యె. రానురాను దాపం బధికంబు కాఁ దొణంగెను. మేను నిష్ఫలం బొరలినట్లు గడు నెరియ సాగెను. మలయవతి యాదురంతసంతాపంబు వేగింప లేక చెలిపైఁ జేయి వైచి కన్నీరు పెట్టుకొని "నెచ్చెలీ! నను బ్రదికించునుపాయంబు మఱేదియు లేదుగా? ఏదైన నుండిన దాని నొనర్చి నాప్రాణంబు కాపాడికొనుము." అనఁ జతురిక "అమ్మా! విద్యాధరచక్రవర్త్యాగమనంబు దప్ప వేఱొండుపాయంబు కన్పట్టదు". అనెను.

ఇట్లు చెప్పుచుండ జీమూతవాహనుం డాత్రేయునితో మలయవతి నిన్నటిరాత్రి తనస్వప్నమున నిదే చందనగృహశశికాంతవేదికపైఁ గూర్చుండి ప్రణయకలహంబునఁ దన్నుఁ దూఱుచు సాక్షాత్కరించె ననియుఁ దనధైర్యం బెల్లఁ గొల్లగొనె ననియు, నిఁకఁ దా నొకనిమిషం బైన మలయవతిని జూడక యోర్వఁజాల ననియుఁ జెప్పుచుఁ దత్ప్రియోపవేశంబున నతిపుణ్యంబును నతిపవిత్రంబును నైనయాచందనలతాగృహంబునకే పోయి యందే యాదిన మంతయుఁ గడ

పెద మనికొని యచ్చటికి వచ్చిరి. మలయవతితో మాటలాడుచుండినచతురిక చెవియొగ్గి యాలించి ససంభ్రమంబుగ "భర్తృదారికా! అడుగులచప్పుడు వినఁబడుచున్నది. ఎవ్వరో వచ్చుచున్నా" రనెను. మలయవతి తత్తరపాటు గదురఁ దన్నవలోకించి "చేటీ! యెవ్వఁడైను నాయాకారంబు చూచిన నాగుట్టు బయటఁ బెట్టును. ఇం దుండ రాదు. అల్లయాకురవకంబుమాటున డాగి యావచ్చెడివార లెవ్వరో చూతము రా" అని సఖియుఁ దాను ను నాకురవకముచాటున డాగి చూచుచుండిరి. అంత జీమూతవాహనుం డాత్రేయునితోఁ జందనలతాగృహంబుఁ జేరి నలువలంకులు గలయఁజూచి, యాహా! యాయిందుముఖి లేనియీచందనలతామందిరంబు చలువఱాలు తాపినదయ్యు వెన్నెలలు లేని విభావరిచందమున నాడెందమున కానందము పెంపక యున్నది. ఏమి సేయుదు నెటు పోదు నని యామలయవతిం దలంచుకొని పరిపరివిధంబులఁ బరితపించుచుండ మలయవతిపరిచారిక మలయవతితో "చెలీ! భర్తృదారిక! నీవు గడుఁ బుణ్యముచేసినదానవు. నీభాగ్యంబు గడు నుత్తమంబు. నీ వెవ్వనిఁ దలంచి యింతదనుకఁ బరితపించుచుంటివో? యాయనయే యీయన. నీపై మరులు నిలుపఁజాలక నినుఁ జూడఁగోరి యిక్కడికి వచ్చినవాఁడు" అన నామెయు జీమూతవాహనునిఁ గనుఁగొని హర్షాశ్చర్యభయంబులు ముప్పిరిగొన సఖితో "నెచ్చెలీ! నా కీయనను జూచినది

మొదలు మే నంతయుఁ గంప మొందుచున్నది. ఈయనయెదుర నిలువఁజాలను. ఇంక నిక్కడ నుందుమేని మనల నీయన చూచినం జూచును. ఇం దుండ రాదు. ఆవలఁ బోదము రమ్ము" అని యచటు వాసి రెండుమూఁడడుగులు ముందుకు నడచి నాతొడ లదురుచున్నవి. ఇఁక నే రాఁజాల నన, జతురిక నవ్వుచు నమ్మా! భర్తృదారిక! యిం దుండిన నిన్నెవరు చూతురు. ఇందే యుందము" అని యందే కూర్చుండిరి.

ఇక్కడ నాత్రేయుఁడు జీమూతవాహనునితో "సంగడీఁడా! యిదె యా చంద్రకాంతవేదిక." అన జీమూతవాహనుండు నిట్టూర్పు పుచ్చి కన్నుల నీరు నించుచుఁ గూర్చుండి యుండెను.

మలయవతియుఁ జేటియు నిది కలలోనివార్తగాఁ దోఁచుచున్నది. ఇంకను గమనించి విందమని యిద్దఱును చెవియొగ్గి వినుచుండిరి.

ఆత్రేయుఁడు జీమూతవాహనునిఁ జేతితోఁ దట్టుచు "వయస్యా! యిదిగో నాచేయిచాయఁ జూడుము. ఇదే చంద్రకాంతవేదిక". అని మరలఁ జెప్పెను. జీమూతవాహనుఁడు కన్నీరు నించుచు వేడినిట్టూర్పు విడిచి "వయస్యా! చక్కఁగాఁ జూచితి. ఇదే యాచలునరాలతిన్నె. ఇందే యాయిందువదన చెక్కిటఁ జెయిఁ జేర్చి ననుఁ దలంచి విలపించుచుండినది. జుంటిమోవి నటింప నంగలార్చునా

యంగనం గనుంగొనిన నావెత లెల్ల నొక్కుమ్మడి యణఁగెను. ఈతిన్నె యాచెలి గూర్చుండ నెంత నోచినదో? మనము నిందే కూర్చుండుదము రమ్ము" అని యిద్దఱును బోయి యాతిన్నెపైఁ గూర్చుండిరి.

మలయవతి, వీ రనుకొనునామె యెవతెయైయుండును? నేనౌదునే? అంతటిభాగ్యంబు నా కబ్బునే? అనఁ జేటిక, "భర్తృదారికా! యెందుల కీసందేహము? మన మొల్లిచెట్టు చాటునఁ గూర్చుండి యీయనను జూచుచున్నామో, యట్లె యీయనయు మనలను జూచియుండును." అన "సరి యీయన పొలయలుకను వహించినప్రియురాలింగూర్చి మాటలాడుచున్నాఁడు. ఆసందేహముఁ బాయ నిన్నడిగితి" అని మలయవతి చెప్పెను.

ఆత్రేయుం డీయన కీప్రియాలాపంబు లెంతయుఁ జెవులకుఁ గడు నింపుఁ గొల్పుచున్నవి. దీనం దప్ప వేఱొంట నీయనయుబునపోకకు నుపాయంబు గాన మని యెంచి "మిత్రమా! యట్లు విలపించుచున్నయామెతోఁ నీ వేమైన నంటివా? ఊరక యుంటివా! అని" యడుగ జీమూతవాహనుఁడు కొన్నిమాటలు పలికితి ననెను. అది విని మలయవతి 'సఖి! ఇఁక వినవలసిన దేమున్నది. ఇంకను వినవలెనా? ఇచటు వాసి పోదము రమ్ము." అని రోషము మీఱఁ దొందరపాటు గదుర నడవఁదొణంగెను. చతురిక చేయి పట్టుకొని నిలిపి 'భర్తృదారికా! మలయవతి! సందియంబు

వాయుము. నీవే యాయనస్వప్నంబున సాక్షాత్కరించినదానవు. నిన్నుఁ గూర్చియే యింతదనుక నాయన మాటలాడుచుండినది. 'అన మలయవతి' సఖి! నీ వేమో చెప్పెదవు గాని నామనస్సునకు నమ్మకము గలుగదు. ఇంకను విందము గాక, అని యిద్దఱును గమనించి వినుచుండిరి.

అట జీమూతవాహనుఁడు తలఁచి తలఁచి విలపించుచు నెంతకు నూరటం బొరయక చిత్రగత నేని దిలకించి యానంద మనుభవింతును గాక యని తలంచి యాత్రేయునిచే రంగులు తెప్పించి యొక్కశిలాఫలకముపైఁ దాను స్వప్నమునఁ జూచినట్టుగాఁ జక్కఁగఁ బ్రియురాలిని వ్రాసి కన్నులకఱవు దీఱఁ జూచుచు, నారచనానైపుణ్యంబునకు మెచ్చుకొనునాత్రేయుని నాశ్చర్యమగ్నునిఁ గావించుచు, నానందరసాబ్ధి నోలలాడుచుండెను.

మలయవతియు నామాటలు స్వప్నవిషయకంబులు గావని తలంచి కుందుచుండెను. ఇంతలోఁ దండ్రియాజ్ఞచే జీమూతవాహనునిఁ జూడఁ బోయినమిత్రావసు వటఁ బోయి యతఁడు గౌర్యాశ్రమసమీపమున నుండుచందనలతాగృహంబునకు వచ్చియున్నవాఁ డని యెఱింగి యచ్చటికి వచ్చెను.

అతఁడు వచ్చుట నాత్రేయుఁడు చెప్ప జీమూతవాహనుఁడు తాను వ్రాసినచిత్రఫలకము నరఁటియాఁకుతో మూసి మాటుపఱచెను. మిత్రావసువు ప్రవేశించి జీమూత

వాహనుని నమస్కరించి స్వాగతాభియోగపూర్వకంబుగఁ గూర్చుండ నియోగింపఁ గూర్చుండియుండెను. కురవకము చాటున నున్నమలయవతియుఁ జేటికయు మిగుల సంతసించుచుండిరి.

జీమూతవాహనుఁడు మిత్రావసువును జూచి 'మీ తండ్రిసిద్ధరాజు సుఖం బున్నవాఁడె? ఏమి కారణంబున నిటు వచ్చితిరి' అని యడుగ మిత్రావసువు తాను వచ్చినపనిని దండ్రియాజ్ఞను సవిస్తరంబుగఁ జెప్పెను. మిత్రావసువు ప్రస్తావించుకన్య తాను స్వప్నమున జూచినకన్య కాదని భావించి జీమూతవాహనుఁడు అతనితో "నయ్యా! మీతోడిసంబంధము నాకుఁ బరమసమ్మతంబు. సర్వశ్లాఘ్యము. అయినను నామనం బన్యాసక్తమైయున్నది. అచ్చటినుండి మఱలించుట గడు దుస్సాధ్యంబుగాన నీమెను బరిగ్రహింప మనసు రాకయున్నది" అనెను. మిత్రావసువు వెలవెల పోవుట కనిపెట్టి యాత్రేయుం డాయనతో "అయ్యా! మిత్రావసూ! యీయన నడిగిన నేమి ప్రయోజనంబు. ఇతఁడు పరాధీనవర్తనుఁడు. ఇతనితల్లిదండ్రుల నడుగుము. ఇతఁడు వా రేమి చెప్పిన నది వినును గాని వారిమాట జవ దాటఁడు." అన మిత్రావసువు "మంచిది. ఈతని తండ్రి యొద్దకే పోయి యడిగెద" నని జీమూతవాహనునియొద్ద సెలవుగైకొని జీమూతకేతువుదగ్గఱకు వచ్చెను.

మలయవతి తన యన్నకును జీమూతవాహనునకును జరిగినసంభాషణను విని "ఇంతదనుక నెంతో యాశపెట్టుకొని యుంటిని. ప్రార్థించినను నీకొనక మాయన్న నిట్లు నిరసించినయీయనవిధమును జూడ నాపై నీయనకు మనసు లేనట్టు తోఁచుచున్నది. ఇంతదనుక నీయన పలికినపలుకు లెల్ల వేఱొకర్తుకంగూర్చి కాని నన్నుఁగూర్చి కావనుకొనినయూహయే సరియైనది. అకటా! ఈవిరహం బెట్లు సైతు" అని కన్నీరు నించి "యిఁక నేఁ బ్రతికిన నేమి ప్రయోజనంబు. అదృష్టహీనురాలనై యిట్లుండుటకంటెఁ బ్రాణముల విడుచుటయే కడు శ్రేయంబు. విద్యాధరచక్రవర్తికిఁ గోఱి గాని యీశరీర మున్న నేమి లేకున్న నేమి? నానోచిన నోము లన్నియు వ్యర్థము లయ్యె. ఎవరి ననిన నేమి కార్యంబు? ఇక్కడ నే యీయశోకంబునకు నీమాధవీలతచే నురి వేసికొని ప్రాణంబు దొఱంగెదను. ఈమేనం గాదేని మఱుమేన నైన నాతనికిఁ బత్ని యగు భాగ్యంబు చేకూరదే? గౌరీవరంబు కల్లయగునే? ఈచతురిక నాయుద్యమంబునకు నడ్డవాటు వేయునేమో?" అని యా చతురికను దనయన్నమిత్రావసువు పోయినాఁడో లేఁడో చూచి రమ్మని పంపి తాను నశోకవృక్షమునకు మాధవీలతను బంధించి చేతఁ బట్టుకొని "గౌరీ! యీజన్మంబున నీకృపకుఁ బాత్రం బగుటకు నోచనైతి. కాని జన్మాంతరంబున నైన నాపుట్టువు దుఃఖభాజనంబు గాకుండఁ జేయు

ము" అని గౌరీదేవిఁ బ్రార్థించి యురిని మెడకుఁ దగిలించుకొనెను. మిత్రావసువుచే జూచి రమ్మని పంపినఁ జతురిక యీమెయుద్యమము నూహించి యచ్చటికిఁ బోక యచ్చటనే యొక్కచెట్టుచాటున దాగియుండి యిది కనుంగొని తత్తరపాటుతోడ వచ్చి "అయ్యో! అయ్యో! రక్షింపుఁడు రక్షింపుఁడు. మాభర్తృదారిక యగుమలయవతి యురిపోసికొని మరణమున కుద్యుక్తురాలైనది" అని బిగ్గఱగా నఱచెను. అది విని చందనలతాగృహంబున నాత్రేయునితోడఁ గూర్చుండియున్న జీమూతవాహనుఁడు తటాలునఁ బరుగెత్తుకొని వచ్చి "యేదీ యేదీ? ఎక్కడ నెక్కడ?" అనెను. "ఇదుగో? యీయశోకవృక్షమున" నని చూప జీమూతవాహనుఁడు దగ్గఱకుఁ బోయి చూచి "ఓహో! ఈమెయె నామనఃప్రియతమ" అని సంతసించి మలయవతిఁ బట్టుకొని యురిని వదలించెను అట్టితెంపరితనంబునకుఁ దానే కారణ మగుటయు నామలయవతి మిత్రావసువు చెల్లె లగుటయుఁ జతురికవలన నెఱింగి మిక్కిలి జాలిఁ బొంది "నేనెంత పొరపాటుపడితిని. కలరూపెఱుంగక యుక్షేపణీయంబైన మిత్రావసువుమనంబునకు నొప్పి గలిగించితిని" అని మిత్రావసువును నిరాకరించినందులకై మనంబున మిక్కిలి నొచ్చుకొనుచుండెను.

మలయవతి లజ్జాహర్షంబులు పెనఁగొన బ్రియునిఁ జూచుచుఁ జేయి లాగుకొనియె. ఆత్రేయుఁడు జీమూత

వాహనుఁ డింతదనుక మలయవతిని దలంచియే విరహవేదన ననుభవించె నని జీమూతవాహనుఁడు వ్రాసినచిత్రఫలకమును జూపి మలయవతికిని జేటికకు ను విశ్వాసము పుట్టించెను. మలయవతి యానందభరితస్వాంతురాలాయెను. ఒండొరులయనుమతిపై నాచందనలతాగృహంబునందే యాయిద్దఱికిని గాంధర్వవివాహ మాయెను.

అట మిత్రావసువు జీమూతకేతువుకడకుఁ బోయి భక్తివినయంబులు దనుపార నమస్కరించి జీమూతవాహనునికిఁ దనచెలియలిని మలయవతిని దీసికొన వేఁడ నతఁడు పరమానందభరితుఁడై కైకొనుటకు నొడంబడియెను. మిత్రావసువు తనయాశ్రమమునకు వచ్చి తనతండ్రిసిద్ధరాజునకు నివేదించి వివాహప్రయత్నంబులు గావించుచుండెను. ఈ వృత్తాంతము నొకపరిచారిక చందనలతాగృహంబునకు వచ్చి "మలయవతి! జీమూతవాహనునితలిదండ్రులు నిన్నుఁ బుచ్చుకొనుట కంగీకరించిరి. నీపుణ్య మే మందును. ఈ దినమే వివాహముహూర్తము. యువరాజుమిత్రావసువు నిన్నిప్పుడే పిలిచికొని రమ్మన వచ్చితిని రమ్ము. పోవుదము" అని చెప్పి మలయవతిని జేటికతోడఁ దనయాశ్రమమునకుఁ బిలిచికొనిపోయెను. మలయవతి భర్తను విడిచిపోవఁ గాళ్లు రాక తిరిగి తిరిగి చూచుచు, నతికష్టముగ నిలు సేరెను.

జీమూతవాహనుఁడు నాత్రేయునితోడఁ దనయాశ్రమంబునకుఁ బోయి మలయవతివివాహంబునకై యెదురు

చూచుచుండెను. ఆదినముననే యతివైభవముతో మలయవతికిని జీమూతవాహనునికి వివాహము జరిగెను, నానాదిక్కులనుండి విద్యాధరబంధుబృందము వివాహమును జూడ వచ్చిరి. బంధువుల కందఱికిఁ దగినట్టు విడుదు లేర్పఱపఁబడెను. స్నాతకవ్రతాదులు ముగిసినపదంపడి మంగళవాద్యములతోడ నెదుర్కొని సిద్ధరా జల్లునిఁ దనగృహంబునకుం బిలిచికొనివచ్చి విధ్యుక్తప్రకారంబున మధుపర్కాదుల నర్పించి సాలంకృతకన్యాదానంబుఁ జేసెను. అల్లునికిఁ దనవిభమునకుఁ దగినట్టు వస్త్రభూషణాదుల నొసంగి వచ్చినబంధుబృందమునకు మిత్రబ్రాహ్మణపురోహితామాత్యులకు గంధపుష్పతాంబూలంబుల నొసంగి సత్కరించెను.

ఆరాత్రి పురంధ్రీరత్నంబులతోడను బంధుమిత్రాదులతోడను బువ్వపుంబంతి మిగుల వేడుకతోఁ జరుపఁబడెను.

ఇట్లు పెండ్లితంతంతయు ముగిసినమఱునాఁ డుదయమున జీమూతవాహనుఁడును మలయవతియుఁ గుమారోద్యానంబున విహారము సల్పుచుండిరి.

అట జీమూతవాహనుఁడు తనరాజ్యమును మంత్ర్యధీనము చేసి వచ్చియుండెను. ఆరాజ్యము మాతంగహతకుఁడనువాఁ డాక్రమించి మిక్కిలిచీకాకుపఱుప నారంభించెను. ఆవృత్తాంతము నొకమనుష్యుఁడు వచ్చి చెప్ప మిత్రావసువు వివాహమహోత్సవానందతుందిలుఁడగుతనయునుంగు

మఱంది పోవనువుపడమి యోచించి తా నొక్కఁడే పోయి మాతంగహతకునిఁ బాఱదోల నెంచి యాసమాచారము జీమూతవాహనునికిఁ దెల్పఁ దత్తఱపాటుతో నతఁ డుండు కుమారోద్యానంబునకుఁ బరుగెత్తుకొనివచ్చెను. అతఁడు వచ్చుటఁ గని మలయవతి గృహంబునకుఁ బోయెను. మిత్రావసువు వచ్చి జీమూతవాహనునికి నమస్కరించి కూర్చుండ నియోగింపఁ గూర్చుండియుండ, జీమూతవాహనుం డతనిబొమముడిపాటును, సంభ్రమంబును గని యతఁ డేదో యొకగొప్పయుద్యమము చెప్ప వచ్చినాఁ డని "మిత్రావసూ! నీమోము తిలకింప నేది యో యొకవిశేష ముండునని తోఁచెడి. అదే" మనియడుగ మిత్రావసు విట్లనియె. మన రాజ్యంబు మాతంగహతకుఁ డాక్రమించినాఁ డఁట. ఇప్పుడే మంత్రులు చెప్పిపుచ్చినారు. నీతోఁ గలసి మాటాడక దేనికిం జొచ్చుట యనుచితం బని యిటఁ బరువిడి వచ్చితి. ఎవ్వరిసాహాయ్యం బపేక్షింపక నే నొక్కరుండనే పోయి యామాతంగహతకునిఁ దెగటార్చెదను. ముదలయే." యన జీమూతవాహనుండు చెవులు మూసికొని మిగుల కటకటంబడి "యెట్టిమాట వినవలసివచ్చెను? పరునిం జంపెద ననుజ్ఞ యిమ్మని యడుగుటకు వీనినో రెట్లాడెను. విన నింపుగానిపలుకులు వీనినోటినుండి యెట్లు వెడలెను? వీని కేమి యుత్తర మొసంగుదు" అని యించుకసేపాలోచించి "మిత్రావసూ! బాహుపరాక్రమశాలి వైననీ కిది యేపాటిది.

కుటిలభ్రుకుటిమాత్రంబున నె శత్రువులగుండియ లవియింపఁ గల నీ కీమాతంగహతకుని వెలార్చుట యొకపని కాదు. అయినను నామనంబు శత్రువునైనను నొంప నిష్టపడదు. కష్టములపైఁ దప్పు నఱిదేనిమీఁదను నాకు బగ లేదు. నాకు హితంబు చేయఁదలంతు వేని రాజ్యలోభంబునఁ గష్టములపాలు గానెంచినమాతంగహతకుని గావ ననుగ్రహింపుము. ఇతరు లడుగకయే ప్రాణముల నైన నిచ్చుటకు వెనుదీయని నేను నాకష్టములఁ గట్టెక్కింప, విశ్రాంతిసుఖం బొసంగ దయచే నారాజ్యంబు నాక్రమించినయీమాతంగహతకునిఁ జంప నిను నెట్లు నియోగింతు? ఉపకారికి నపకారము చేయుట ధర్మమే? దయచేసి దీనిని మాతంగహతకుని మన్నింపుము” అని ఱాయియైనను గరఁగి నీరు గాఁజాలినమృదుమధురనీతివాక్యములచే నాతనిమనంబు కఱఁగునట్లు చేసి యాయుద్యమమునుండి మాన్పి యనిపెను.

అంత నామఱునాఁడే తల్లిదండ్రులు మలయవతిని బెక్కు లరణంబులతోడ నత్తగారింటికిఁ బంపిరి. మిత్రావసువు చెల్లెలిని వెంటఁ బెట్టికొని వచ్చెను.

ఒకనాఁడు మిత్రావసువు, జీమూతవాహనుఁడు ను నామలయఫర్వతప్రాంతమునందలిసముద్రపుఁబోటును జూడఁబోయి కొండగుహాలు ప్రతిధ్వను లీనఁ జెవులు చిల్లులు వోవ రొదచేయుచు, గభిల్ గభిల్లు మని పైకెగయుచుఁ

దత్క్షణంబ యణంగుచు వచ్చు తెల్లనియాపోటును జూచి మిగుల సంతోషపడుచుఁ దద్విషయికమైనప్రశ్నోత్తరములు సల్పుచుఁ బోవుచు నొక్కెడఁ దొల్లి గరుత్మంతునిచే భక్షింపఁబడి పాఱవేయఁబడినయెముకలరాసులను మంచుచేఁ గప్పఁబడినమలయపర్వతప్రత్యంతపర్వతములనుగా భావించి జీమూతవాహనుండు మిత్రావసువుతో నిట్లనియె.

“మిత్రావసూ! చూచితివా? శరత్కాలమేఘములగుంపుచే నావరింపఁబడినయీమలయపర్వతసానువులు హిమాలయశిఖరంబుల విడంబించుచున్నవి. ఆహా! యేమి వీనిరామణీయకము!” అన మిత్రావసు విట్లనియె. “ఓహో! యివి మలయపర్వతసానువులు గావు. పాములయెముకలరాసులు సుమా! తెల్లగ నుండుటచే భ్రాంతిఁ జెందితివి.” అన జీమూతవాహనుండు గడగడ వణంకుచుఁ గటకటా! యిన్నిపాము లొక్కపరి సంఘాతమరణంబు నొందుటకు నేమి కారణంబు? స్వల్పకారణమ్మున కిట్లిన్ని యొక్కుమ్మడి మడియునే? అని యడుగ మిత్రావసు విట్లనియె. ఇవి యన్నియు నొక్కసారిగ మరణమ్ము నొందినవి గావు. తొల్లి గరుత్మంతుఁడు ప్రతిదినము తనఱెక్కలగాలిచే సముద్రపునీటిని నెగఁజిమ్మి పాతాళము ప్రవేశించి యొక్కొక్కపామును దన్నుకొనివచ్చి యిటఁ బెట్టికొని భుజించుచుండెను. అట్లు ప్రతిదినము తిని పాఱవేయ నాయెముకలు ప్రోవులై కొండలు గొండలుగఁ బడియున్నవి” అని చెప్ప జీమూతవాహనుం డిట్లనియె.

"గరుత్మంతుఁడెంతటిక్రూరకర్మంబునకుఁ బాల్పడినాఁడు. ఆవలనేమి జరిగెనో చెప్పుము" అన మిత్రావసు విట్లనియె. ప్రతిదినమును వేనవేలు పాములు గరుడునివాతఁ బడి మడియుటను, నాభయంబుచేఁ బెక్కురగు నాగాంగనలకు గర్భస్రావంబు లగుటను గని కొలఁదిదినంబులలోనే తనవంశంబు నాశంబు గాఁగల దని తలంచి యాపాపతేఁ డగు వాసుకి గరుత్మంతునితో నిట్లని మొఱపెట్టుకొనెను.

అయ్యా! విష్ణురథా! నీవు వచ్చి పైఁబడుదు వనుభయంబున నెన్నియో నాగాంగనాగర్భంబులు స్రావంబు నొందుచున్నవి. ఎందఱో నాగవనిత లనాథ లయిరి. ఎందఱో వృద్ధవనితలు బిడ్డలం బోఁగొట్టుకొని వెతలం గుడుచుచున్నవారు. వారలగోడు గన్న నాకుఁ గాదు గదా? యెట్టివానికేని యుపగుండియువానికైనను మనంబు నీఱు గాక మానదు. మాపట్టణంబున నెన్నియో గృహంబులు పాడుపడియున్నవి. ఎన్నియో కుటుంబములు నామమాత్రావశిష్టంబులైనవి. ఇఁకఁ గొన్ని దినంబులకు మాపట్టణంబు జనశూన్యంబై భూమిపై సర్పము లన్నపేరు లేకపోవ నున్నది. అవ్వల నీకు నాహారంబు దొఱకుట కడు దుర్లభం బగును. కాన నామొఱ్ఱ యాలకించి నామనవి గైకొని నన్ను ధన్యునిం గావింప వేఁడెదను. దీన నీకు ను యావజ్జీవం బాహారంబు గలుగును. మావంశంబును భూమిపై నుండుభాగ్యంబు గలుగును. నీ వాహారంబునకే కదా ప్రతిదినము

ప్రవేశించెదవు. నేనే దిన మొకపామును నిచ్చటికిఁ బంపుచుండెదను. దానిని భక్షించి మాపైఁ గరుణించి యిది మొదలు మాపట్టణముదిక్కున నీచూడ్కిఁ బ్రసరింపఁ జేయక యనుగ్రహింప వేఁడుచున్నాఁడ. దీనమానవుల రక్షించుట పరమధర్మం బని నీ వెఱుంగవే. నీ వెఱుంగనిధర్మంబులు గలవే? ఈదీనునివలనం గరుణింపవలయు" నని మిగుల దీనతతోఁప వేఁడికొనియెను. అన జీమూతవాహనుం డిట్లనెను. ఆహా! యెంత చక్కఁగా రక్షించెను నాగకులంబును! ఆనాగరాజునకు రెండువేలనాలుకలు గలవే? అందులో నొక్కనాలుక యేని తనను నొక్కని భక్షించి నేటికి మ మ్మాబారి నుండి తొలగింపు మని వాకొనఁజాలకపోయెను గదా! ఎంత నిర్దయత్వము! తన్ను నొక్కని నర్పించి నాగుల కిట్టి కష్ట మింక లేకుండఁ జేసిన నానాగరాజున కెంతపుణ్యము వచ్చి యుండును! ఎంత కీర్తి గలిగి యుండును! "పరోపకారార్థమిదం శరీరమ్" అని యెఱుంగఁడు కాఁబోలు. గరుడుఁ డా నాగరాజు ప్రార్థన నంగీకరించెనా?" అని యడుగ మిత్రావసు విట్లనియె. ఇట్లతిదీనంబుగఁ జెప్పికొన నాగరాజుమనవినిఁ జిత్తగించి, యందుల కొడంబడి, యదిమొదలు దినమొక్కటిగ నాగరాజుచేఁ బంపఁబడుపాములను గరుడుఁడు భక్షించుచు వచ్చెను. దినక్రమమున నేర్పడినవే యీనాగాస్థికూటములు. అన జీమూతవాహనుండు "ఆహా! యేమి యీ వింత! పలురోగములకుఁ డెంకియై, చేసిన

మేలును గొంచెమైనను గణింపక మలమాంసభూయిష్ఠమై యిప్పుడో రేపో పడిపోవుటకు సిద్ధముగా నున్న హేయంబగు నీపాడుదేహంబునకై మూఢు లెన్నియో పాపంబులు చేయుదురు. తమదేహ మెట్లో యట్లె యొరులదేహ మని తలఁపఁగూడదా? తమదేహంబునకు బాధ యొదవిన నెట్లో యట్లె యితరులకు నని భావింప రాదా? "జాతస్య మరణం ధ్రువమ్" అని పుట్టినవారు గిట్టుట సహజంబై యున్నది. ఎవ్వరు ను శిలాశాశ్వతముగా నుండఁబోరు. ఇంతమాత్రంబునకు నాత్మాపరభావంబునం జేసి యెంతెంత పనులఁ జేసెదరు. అకటా! నాగులకు సంభవిల్లినకష్టదశను దలంచుకొన్న గుండె లవియుచున్నవి" అని మనంబున నిట్లని తలపోయఁ దొణంగెను. నా కీదేహ ముండి యేమి ప్రయోజనంబు. ఈపాడుదేహము నర్పించి యొక్కపాము ప్రాణంబేని రక్షింప వలను పడునేని యెంతయు బాగుగ నుండును. నాగరాజు ప్రార్థించి దిన మొక్కదాని నొసఁగి ప్రతిదినము వేనవేలు నశింపక యుండఁ జేసెను గదా? నేను ను ఖాగరుడుని గడుదీనత్వముతోఁ, నన్ను భక్షించి యిఁక నీపాముఁబాలికిం బోవలప దని వేడికొనిన మానఁడా? నేఁ జెడుటకంతగ దుఃఖింపను. ఒరులప్రాణరక్షణంబు గావించినాఁ డన్న నా కీర్తి భూమిపై శాశ్వతముగ నుండినఁ జాలదే? వేదపాఠంబును సర్వతీర్థాభిగమనంబును నభయదానంబునకు సరి రావని చెప్పుదురు. వినతానందనుండు సకలధర్మవేత్త నా వేడికోలు

ను వ్యర్థపుచ్చుఁడు. అని యనుకొనుచుండ నొకప్రతిహారుండు వచ్చి తండ్రి పిలిచికొని రమ్మని చెప్పె నని మిత్రావసువును బిలిచికొనిపోయెను.

జీమూతవాహనుం డామలయపర్వతశిఖరమునుండి దిగి చెలియలికట్టను జూచుటకుఁ బోవుచుండెను. ఆవైపునుండి "అక్కటకటా! శంఖచూడా! తండ్రీ! నిన్నుఁ జంపుచుండ నీపాడుకన్నులతోఁ జూడవలసివచ్చెను గదా? మూడుకాళ్ల ముదుసలిని. నన్ను విడిచి యెటు పోయెదవు? ఇఁక నిన్నుఁ జూడనుగదా?" అని యొకయార్తనాదము వీతెంచెను. జీమూతవాహనుం డది విని డెందంబునఁ గుందుచు "నిది స్త్రీవిలాపమువలె వినఁబడుచున్నది. ఈమె యెవతెయై యుండనోపు. సామాన్యదుఃఖమునకు నిట్లు వా విడిచి యేడ్వదు. ఎందులకై యిటు లీమె విలపించుచున్నదో విచారించెదను. అని యనుకొనుచుండునంతలో నొక ముసలిది వెంటఁబడి యేడ్చుచు రాఁగా శంఖచూడుఁ డనునాగకుమారుఁడును నెఱ్ఱబట్టలను చేఁ బూని యొకకింకరుఁడును నచ్చటికి వచ్చిరి.

ఆవృద్ధాంగన కన్నీరు మున్నీరై కాఱ, నాననమున దైన్యంబు ప్రేలాడ, "అయ్యో, వత్సా! నిన్నుఁ గన నోచితినిగాని నీవు పోషింప సుఖం బుండ నోఁచనైతి. ఇఁక నన్నెవ్వరు 'అమ్మా' యని పిలుచువారు? ఎవ్వరి కని నేఁ బ్రాణముల భరింతును. కుసుమసుకుమారంబయిన నీమే నీ గరుడుఁడు భక్షిం

వుచుండ నే నెటు చూతును! గడ్డము పట్టుకొని ముద్దుపెట్టుకొనుచు నీమోముచందురుని నిఁక నేఁ జూడనుగదా? నీమోముచందురుఁడు లేమి పాతాళలోక మంధకారబంధురంబౌనుగదా? అయ్యో! గరుత్మంతుఁ డెంతనిర్దయుండు. ఇంచుకయినను దయలేనివాఁడు. తన ప్రాణములు తన కెట్లు తీపో యట్లె యితరుల ప్రాణములును నని యెఱుఁగఁడా? 'స్త్రీలసహాయులు. అబలలు' అని కనికర ముంపఁగూడదా? ఎండవేడిమి నేని సహింపని నీమే నిప్పుడు గరుడునితీక్ష్ణతుండవిదారణంబున కెటు లోర్చును. నాయనా! త్వదేకపుత్రనైన నాగతి యేమగును. నన్నెవ్వరికి నొప్పగించిపోయెదవు. అకటా! వాసుకీ! నాపుత్త్రుఁడే నీకు జ్ఞప్తికి వచ్చెనా! ఏతదేకపుత్త్రను, అసహాయురాల నని కనికరము గలుగక పోయెనా? వేనవేలు సర్పము లున్నవే. వా రెవ్వరు నీకు జ్ఞప్తికి రాకపోయిరిగదా! నాదురదృష్ట మిటులుండ నిన్నేమనియందును. నిన్నిఁక నేఁ జూడనుగదా! త్వదేకపుత్రనైన నన్ను విడిచిపోవుట న్యాయ్యము కాదు. ఎన్నాళ్లు చూచి నను క్రొత్తక్రొత్తగఁదోఁచు నీమోము నింకొకతూరి చూడనిమ్ము. ఇఁక నిది దుర్లభముకదా?" అని కొడుకుమెడ కౌఁగిలించికొని యూఱక యేడ్వసాగెను.

శంఖచూడుఁడును, తల్లిదైన్యంబు చూచి ధైర్యంబువిడిచి తానును నేడ్చుచుఁ దీరమి విచారించి పొరలిపొరలివచ్చు వేఁడికన్నీళ్లు దుడిచికొనుచు డగ్గుత్తికతోఁ దల్లి కిట్లనియె.

అమ్మా! ఏడువకేడువకుము. నీయేడ్పు నను మఱింత బాధించుచున్నది. విధిచెయ్వు లతివిచిత్రంబులు. వానిని మీఱ నెవరికి నసాధ్యంబు. మనయభాగ్యత యిట్లుండ నెవరి నన్నే మిప్రయోజనము. పుట్టినవారి కెల్ల గిట్టుట సహజంబైయున్నది. మృతికి వగచినఁ బ్రయోజనము కలదే? నేఁడో రేపో అందఱు మృతిఁబొందువారేకాని శాశ్వతముగ నుండువా రెవ్వరును లేరు. నాకీవిధమున మృతి ఘటించుటయు నదృష్టంబని తలంచెద. రాజుసర్వజనపూజ్యుండు. అతనియానతిని శిరసా వహించుట యెల్లరకు శ్రేయోదాయకంబును, ఇహాముత్రఫలదంబునైయున్నది. మనరాజీనియమము నేర్పఱిచినది మనకులంబును గావనుగదా? నే నొకఁ డీ నియమమునకుఁ దప్పిన మరల మనకులంబున కెల్ల హాని కల్పించినవాఁడనగుదునుగాదే? ఊరడిల్లుము. ఎంత యేడ్చినను వృథాకంఠశోషమే కాని గరుడునికిఁ గనికరంబు గల్గునే? పాపము రాజేమి చేసినాఁడు! నిత్యప్రళయమున కోడి గదా యిటు నియమము చేసికొన్నవాఁడు. సమాశ్వసింపుము. ఇఁకఁ బొమ్ము. అని యెంత యూఱడించినను నూఱడిలక వాపోవుచుండెను.

అప్పుడు వాసుకికింకరుఁడు శంఖచూడునితో "అయ్యా! కన్నకడుపుగాన నీమె యిట్లు వాపోవుచున్నది. మూఢురాలుగాన రాజాజ్ఞ యెఱుంగదు. సర్వము దెలిసిననీవును నీమెతోడ ధైర్యమ్మును విడిచి యేడ్చెదవు. మనము వధ్యశిలదగ్గఱకు వచ్చినారము. ఇఁక వధ్యచిహ్నము నిచ్చెదను" అని చెప్పు

చుండ జీమూతవాహనుండు చెట్టుచాటున దాగియుండి యిదియంతయుఁ జూచుచుండెను.

అంత వాసుకికింకరుఁడు చేతులు దోయిలించి కన్నీరు కాఱ శంఖచూడునితో నిట్లయెను. అయ్యా! నేఁ బరాధీన వర్తనుఁడను. నిన్నుఁ జూచినను, నీతల్లిని జూచినను రాజునాజ్ఞ నిర్వహించుట నాకుఁ గడు దుస్తరంబై కన్పట్టుచున్నది. రాజాజ్ఞ మీఱినవారికి నిచ్చట నచ్చటఁ గూడఁ బాపంబు గలదు. ఇట్లనతిక్రమణీయమైన రాజాజ్ఞచే నీమాట యెట్లు చెప్పుదునాయని నామనంబు మిగుల ఖేదంబునొందుచున్నది. చెప్పకపోయిన నాతల పోవుచున్నది. ఏమి చేయుదు. ఎటు చేయుటకుఁ దోఁపకయున్నది. అకటా! సేవకవృత్తి యెంత చెడ్డది. అని రాజాజ్ఞను జెప్పఁ గొంకుచుఁ దీరమిచే నాలుకకు వచ్చినమాటల నణఁచుకొనుచు నిలువఁబడియుండెను. శంఖచూడుఁ డదిచూచి యోభద్రా! ఏమట్లు లాలోచించెదవు. రాజాజ్ఞ యెయ్యదియో చెప్పుము. రాజాజ్ఞ నీకును బోలె నాకు ననతిక్రమణీయంబ. చెప్పఁగొంకినఁ దప్పునే? రాజేమి యాజ్ఞాపించెనో చెప్పుము. నేను స్వామికార్యనిర్వహణసుకృతముం బొందెదను. ఎప్పుడో యొకతూరి యీశరీరము పడునదికాని యుండునది కాదు. అప్పుడవునది యిప్పుడే యయ్యెడును" అన నావాసుకికింకరుఁడు కృతాంజలియై "నాగరాజాజ్ఞాపించుచున్నాడు. ఈరెండు రక్తవసనములను గట్టుకొని యీవధ్యశిల యెక్కుము. గరుత్మంతుఁ డీగుర్తుచే

నీవే వధ్యుండ వని యెఱింగి నిన్నాహారంబుగాఁ గొనును" అని యా యెఱ్ఱబట్టలరెంటిని చేతికిచ్చెను.

శంఖచూడుఁ డతివినయముతో నారెంటిని దీసికొని కన్నులనొత్తుకొని "యివ్విధమున స్వామికార్యము నిర్వహింపఁగలిగినందులకై నేనెంతయు సంతసించుచున్నాను," అని వధ్యశిలారోహణంబునకై సంసిద్ధుండైయుండ నాతనితల్లి తనపుత్త్రునివధసమయం బాసన్నమైన దని యెఱింగి ఱొమ్మప్పళించుకొనుచు, నాయనా! నిన్నెటు విడుతు రా? హా తండ్రీ! ఇది పిడుగుదెబ్బకంటె వేయిమడుఁగుల కధికంబై నాహృదయం బగల్చుచున్నది. అని వగపెల్లిదంబున మూర్ఛపోయి కొండొకవడికిఁ దెప్పిరి 'వత్సా! శంఖచూడా! నినుఁ బడయ నాపడినపాటు లెల్లఁ బొల్లయయ్యె. లేకలేక కలిగిన యొక్కకొడుకవే. నిన్ను విడిచి నే నెటు పోవుదును? నిన్నుఁ గన్న యంతనె నాకోర్కు లెల్ల ఫలించె నని యనుకొంటినిగాని యిట్లకాండప్రళయంబు సంభవిల్లునని కలయందైన నెఱుంగనైతినే? అకటా! ఎటు పోదును. నిన్ను మరల నే నెక్కడఁ జూతును? అని కంఠము గౌఁగిలించుకొని గట్టిగా రోదనము చేయుచుండెను.

వాసుకిభృత్యుఁడు "ప్రొద్దు పోయినది. గరుడుఁడు వచ్చువేళ యయినది. నేఁ బోయి వచ్చెదను", అని శంఖచూడుని వీడ్కొని వెడలిపోయెను. ఇది యంతయుఁ జెట్టుచాటుననుండి చూచుచుండినజీమూతవాహనుండు "గరు

త్తంతుఁ డెంతటికూళ. ఎంత నిర్దయుఁడు. ఇంతనిర్దయుని నెందును గానము. అకటా! ఎంతనిర్దయుని కైనను నీ ముసలిదానిం జూచినఁ గనికరము పుట్టదా? ఈమె యేడ్చి యేడ్చి మూర్ఛపోయి మేల్కని 'హా కొడుకా! హా తండ్రీ! ఇఁక నెవ్వరు కాపాడువారు.' అని వినువారిహృదయంబులు కరఁగ దిక్కులు చూచుచు నేడ్చుచుండ నీమెపుత్త్రుని మెసవుతార్క్ష్యుని గుండె ఱాతితోఁ జేసిరో యినుముతోఁ జేసిరో యెఱుంగను. ఆహా! ఎంతకఠినహృదయము. అని విచారపడుచుండెను.

వెల్లివిరిసివచ్చు కన్నీళ్లను దుడిచికొని తల్లిని బొమ్మన నొల్లక శంఖచూడుఁడు గరుత్మంతుఁడు వచ్చుసమయంబు దలంచి యిఁకఁ బొమ్మనక తీర దని విచారించుచు, నెట్టకేలకు హృదయంబు గట్టిచేసికొని తల్లితో నిట్లనియెను.

“అమ్మా! యెంత దుఃఖించిన నేమి ప్రయోజనంబు? నే గరుడునివాఁడనుగాని నీవాఁడనుగాను. ఇంటికిఁ బొమ్ము. గరుడుఁడు వచ్చెడివేళ యయినది. ఇక్కడ నుండఁదగదు పొమ్ము. ఊఱడిల్లుము. అని యెంత చెప్పినను పోక ఱాతిగుండె యయినను గరఁగునట్టు లేడ్చుచు మూర్ఛపోయెను.

అప్పుడు జీమూతవాహనుఁడు మిగులఁ జాలిం బొంది “కటా! ఈమెపుత్త్రశోకము దుర్భరంబు. ఈజాలి గన్న నా ప్రాణము నైన నిచ్చి యీతని బ్రతికించి యీమెకుఁ బుత్త్రదానము చేసిన బాగుగ నుండును. బంధువుల నెల్లఁ బాసి

దిక్కులేక యుసురులఁ దొఱంగ నతిదీనుండైయున్న యీ పిల్లవానిని గావనేని నా కీశరీరముతో నేమి ప్రయోజనంబు. దానములలో నెల్లఁ బ్రాణదానము శ్రేష్ఠముగదా? దీని నొసంగఁజేని మనుష్యుఁడు దాత యనంబడునే? ఇంక నీ ప్రాణములతోఁ బనిలేదు. దగ్గఱకుఁ బోయి పలుకరించి యవశ్యముగఁ బ్రాణదానం బొసంగి కృతార్థుండ నయ్యెదను.” అని సమీపమునకుఁ బోవఁ బ్రయత్నించుచుండెను.

ఇంతలో మూర్ఛపోయి పడియుండిన శంఖచూడుని తల్లి తెప్పిఱిలి లేచి కొడుకును గౌఁగిలించికొని “నాయనా! శంఖచూడా! సకలోరగపరిరక్షకుండగు వాసుకియే నిన్ను విడిచినాఁడు. ఇఁక నిన్నెవరు కాపాడఁగలుగుదురు. కుమారా, ఎవరిని వేడిన రక్షింతురు?” అని పెద్దపెట్టున నేడ్వసాగెను.

అంత జీమూతవాహనుం డిదేసమయంబు. ఆమెయె కొడుకుప్రాణదానంబు చేయుమని వేడుచున్నది. నేను బోకపోయిన మఱియెవ్వఁడైన ప్రాణదానం బొసంగి సుకృతముం గనును. నేనె యాసుకృతమును బొందెదను, అని తోఁటలోన చెట్టుచాటుననుండి దగ్గఱకుఁ బోయి “అమ్మా! భయపడవలదు. నేను నీకొడుకుప్రాణరక్షణము చేయువాఁడను.” అని గంభీరస్వరముతో నుడివెను. ఆమె యట్లు చెప్పిన జీమూతవాహనుని గరుత్మంతునిగా భావించి తత్తరపాటుతోఁ దనకొడుకును నెఱ్ఱగుడ్డతోఁ గప్పిపెట్టి జీమూతవాహనునియెదుర మోఁకాళ్లపై నిలిచి, ‘ఓగరుత్మం

తా! ముల్లోకములకు నాయకుండగు వెన్నునివాహనంబవు. నీకుఁ దెలియని ధర్మములు లేవు. దానంబులలో నెల్లఁ బ్రాణదానం బత్యుత్తమం బని చెప్పుట చర్వితచర్వణంబు. అనాథను. అబలను. ఏతదేకపుత్రను. నాపైఁ గరుణించి పుత్రభిక్షపెట్టి నన్ను మనుప నతిదైన్యముతో వేఁడుకొనుచున్నాను. నామొఱ యాలింపుము. నాయసహాయతను దలంపుము. నా కాహార మెట్లందువేని నాదేహం బొసంగెదను. దీనినిఁ గడుపార భుజింపుము. నాపుత్రునికంటె నాదేహ మెక్కువ కాదు. నాపుత్రుఁడు బ్రతికిన నావంశం బెల్లఁ దరించును. నేను బ్రతికిన నేరికిం గొఱగాను. నను నెరగాఁ గొని నాపుత్రుని బ్రతికింపుము' అని ప్రలాపించుచుండ జీమూతవాహనుండు చావఁబంపఁబడిన యీతం డింత దుఃఖింపఁడు గాని యీమెగోడు చూడ గుండెలు ఝల్లుమనుచున్నవి. పుత్రశోకార్ణవమగ్నయైన యీమెను గన్న నెంత కఠినహృదయంబైనను నీరు కాకమానదు. గరుత్మంతునిఁ జెప్పనేల? గరుత్మంతుఁ డీమెను జూచెనేని తన తలంపునుమాని కరుణఁ దాల్పకపోఁడు. అని యనుకొనుచుండ, శంఖచూడుఁడు జీమూతవాహనుని గరుత్మంతునిగా భావించి వేడుకొనుచున్నతనతల్లినిఁ గాంచి “తల్లీ! యీతఁడు గరుత్మంతుఁడు గాఁడు. శాంత మొల్కుచు జాలిమల్లాడు మోముగల యీతఁ డేడ! పాములమెదడును, మాంసమును, రక్తమును మెసవు దీర్ఘతుండంబుగల గరుత్మంతుఁ డేడ! అన

వుడుఁ దల్లి యిట్లనియె. “తండ్రీ! నేనేమి చేయుదు. నీ మరణంబునకు వెఱచు నాకుఁ బ్రపంచమందంతట నెదిగన్నను గరుడమయంబుగా నగపడుచున్నది.” నావుడు జీమూతవాహనుండు, ‘అమ్మా! మాటలచే నేమి ప్రయోజనము. ఇదిగో పనిచేత రక్షించెదను. దయచేసి వధ్యచిహ్నంబు నాకిమ్ము. దానిఁ గప్పికొని వధ్యశిలయెక్కి నీకొడుకునకు మాఱుగా గరుత్మంతునికి న న్నర్పించికొని నీకొడుకును గాపాడెదను. దయచేసి వధ్యచిహ్నంబు నిమ్ము.” అని యడుగ శంఖచూడునితల్లి యిట్లనియె.

శివశివ యాలాగు చేయకుము. నీ వొక్కటి, మావాఁడొక్కటి గాదు. మావానికై నే నెట్లడలుదునో యట్లె నీకై యడలుదును. యెవ్వరైన నేమి? మాశంఖచూడునికంటెను బంధువు లెల్లను విడిచిన నాకొమారుని నీశరీర మొసంగి కాపాడఁ దలంచిననీవే యధికుండవు. ఇట్టి పరోపకారి నెందునుం గాన. లోకం బెల్ల స్వార్థపరత్వంబున మునింగియున్నది. నీవలె స్వశరీర మొసంగి పరోపకారంబు చేయఁదలఁచినవారెవ్వరు నుండరు. ఆహా! నీజీవకారుణ్యము గడుఁ జిత్రముగనున్నది. ఈయుద్యమమునుండి మరలుము. అని చెప్పుచుండ, శంఖచూడుండు జీమూతవాహనునికారుణ్యాతిశయంబునకును, ననన్యాదృశపరోపకారపరాయణత్వంబునకును మిగుల నచ్చెరువుపడుచు, నాహా యేమిప్రాణంబులపై నిస్పృహాత్వము. ప్రాణంబు లన నీయనకుఁ దృణప్రాయంబులై

యున్నవి. తొల్లి యీప్రాణంబులఁ గాపాడనుగాదె యఘటనఘటనాసమర్థుండగు విశ్వామిత్రుండు మాలనియింటఁ గుక్కమాంసంబు ముచ్చిలి మెసవెను. గౌతముండు దనకు మహోపకారంబు గావించి కూడవచ్చుచుండిన నాళీకజంఘుని వంచనచేఁ జాలిగొనియె. వెయ్యేల! ఈ ప్రాణరక్షణంబునకై గాదె గరుడుండిప్పుడు నాగులప్రాణంబులఁ దీయుచున్నవాఁడు. ఇట్లు లోకంబెల్ల ప్రాణరక్షణంబునకై యెన్నియో కడగండ్లు పడుచుండ నీతం డా ప్రాణంబుల హాళిని గడ్డిపరకఁబోలె నొరులకు నొసంగుచున్నవాఁడు. ఔరా! ఎంతటిదయాళువు. అని తలంచుచు జీమూతవాహనుం జూచి 'అయ్యా! నీవిట్లయాచితంబుగ నీమే నెరఁగా నొసంగి నాప్రాణంబుఁ గాపాడఁగడఁగుటయే నీకుం గలజీవకారుణ్యంబు వేనోళ్లఁ జాటుచున్నది. అకృత్రిమపరోపకారధురంధరుండవగు నీవు ధరాభారంబు వహించుచుండిన నెందఱో జీవించుచుందురు. నావంటిముక్కడులు బ్రతికిన నేమి ప్రయోజనంబు. చచ్చిన నేమి నష్టంబు? ఇట్టి కుక్షింభరు లెందఱీలోకంబునఁ బుట్టరు. ఎందఱు గిట్టరు? నీవలె నొరులఁ గాపాడఁ గంకణంబు కట్టుకొన్నవా రెందును గలుగరు. నాపై దయయుంచి నావేడికోలియ్యకొని గరుడునికి నాహారం బగుటకు నాజ్ఞ యొసంగుము. సకలభోగభాగ్యభాజనంబైన నీమేనిం గాపాడుకొమ్ము'' అని చెప్ప, జీమూతవాహనుం డిట్లనియె.

''ఆర్యా! శంఖచూడా! నాప్రయత్నమున కడ్డువాటు వేయకుము. నే నెన్నిదినంబులుగనో యీసుఖం బనుభవింపఁ గోరి యున్నాఁడను. ఈవిధంబగు పరోపకారంబు గావింప ననువుపడ దాయెఁగా యని యెదురుచూచుచుండ నిన్నిదినంబులకు నేఁడు నాయదృష్టవిశేషంబునఁ బరార్థసంపాదనంబు గావించి సుకృతంబుం బొందుభాగ్యంబు గల్గె. దీనికి నీ వడ్డపడుదువేని మదీయాభిలాషంబునకుఁ బ్రతిరోధంబు గావించినవాఁడ వగుదువు. దయచేసి వధ్యచిహ్నంబు నా కిమ్ము. పరాభిలాషపూరణసుకృతం బందుము.'' అనవుడు శంఖచూడుం డిట్లనియె.

''అయ్యా! ఈపట్టున నీప్రయాసంపాటు వ్యర్థంబు. నీకోరిక నెఱవేరదు. నీవలె నేను ను సుకృతంబు గట్టుకొనం దలంచుచున్నాఁడను. ఎవ్వండైనఁ బాలవంటికులం బపకీర్తిపాలు గావించునే? ప్రతిమనుజునకుఁ దనకు నపయశంబు రాకుండఁ జేసికొనవలయు ననునాశ తుల్యంబై యుండును. నీకు నాపై దయ గలదేని నా యీతల్లి చావకుండునుపాయంబు నాలోచింపుము. నా కీయెడ నీయుపకారంబు గావించిన నిను మహోపకారినిగ భావించెదను. ఇఁక దేని నపేక్షింపను.'' నావుడు జీమూతవాహనుం డిట్లనియె.

''శంఖచూడా! ఇం దేమి యుపాయం బున్నది. నీవు బ్రతికిన నీమెయు బ్రతుకును. నీవు చచ్చిన నీమెయుం జచ్చును. కన్నతల్లిని చావునకుం దప్పింప నెంతువేని నాయుద్యమంబున

కియ్యకొని నన్నాహారముగా నొసంగి నినుఁగాపాడుకొనుము. ఇది తక్క వేఱొండుపాయంబు లేదు. ఏల యాలసించెదవు. త్వరగ వధ్యచిహ్నంబు నిమ్ము. సంతోషంబుగా వధ్యశిల యెక్కి గరుడునికి నా దేహంబు నర్పించెదను. నీవు నీతల్లిని బిలిచికొని ఘోరం బగు నీస్థలమునుండి పోదువు. ఇందుం డుడువేని నతిభయంకరంబైన యీస్థలమును గనుంగొని నీతల్లి స్త్రీస్వభావసిద్ధం బగుభయంబుచేఁ బ్రాణముల వదలి నను వదలును. అదిగో చూడు. పాములకంకాళంబులు గొండలుగొండలుగ నెట్లు పడియున్నవో! ఇట్టిచోటున నీముదివగ్గును దుఃఖసాగరమగ్నను దడ వుండనీయరాదు" నా శంఖచూడుం డిట్లని చెప్పం దొడంగెను.

"ఈ స్థలంబు నే నెఱుంగనిది కాదు. అహరహంబును మాకులంబున కెల్లఁ బొలికలనని యెఱుంగనే? ఏల బెదరించెదవు. గరుడుండు వచ్చువేళ యయినది. ఇఁకం బొమ్ము" అని చెప్పి తల్లియెదుర మోకరించి యిట్లనియె. అమ్మా! ఎంతసే పేడ్చెదవు: నే నిచ్చట నుండువాఁడను. నీవు పోవలసినదానవు. ఆలసింపక పొమ్ము. తల్లీ! యీతార్క్ష్యునివాతంబడి మడసిన నాకు ముందుజన్మంబునను నీవే తల్లివి యగునట్లాశీర్వదింపుము. దేవుఁ డావిధంబుగ ననుగ్రహించుఁగాక. ఇంక రాజునాజ్ఞ నెరవేర్ప నేఁ బోయెద" అనఁ దల్లి యిట్లనియెను. "నీతోడిసంభాషణంబు నేటితో ముగిసెనా? ఇది కడపటిపలుకా! ఇఁక నిన్ను నేఁ జూడనుగదా! నిన్ను విడిచి

నే నెటు పోదు. నీవు లేమిచేఁ బాడుపడియున్న యింటికి నే నెటు పోదు. ఇఁక నన్నెవరు అమ్మా అని పిలుచువారు! ఎవ్వరిని నేఁ గొడుకా యని పిలుతును. నీతోడ నన్నును నా తార్క్ష్యునకు నెరగా నర్పింపుము. నాయనా! నన్నెవ్వరి కొప్పగించెదవు. ఇందే నీతోడ నుండెదను" అని విలపించుచు నీడిగిలఁబడ, శంఖచూడుండు "అమ్మా! నేఁ బోయి యీపొంతనున్న గోకర్ణేశ్వరునికిఁ బ్రదక్షిణముచేసివచ్చి రాజాజ్ఞ నెఱవేర్చెదను" అని పోవ వానితోడఁ దల్లియు నరిగెను.

వివాహమైనపదియవదినమున నత్తగారల్లునికి నెఱ్ఱబట్టలను కట్టఁబంపుట యాదేశాచారమైయున్నది. దానంజేసి మిత్రావసువుతల్లిచేఁ బంపఁబడిన యొకకంచుకి రెండెఱ్ఱబట్టలను దీసికొని యప్పు డచ్చటికి వచ్చుచుండెను. అది చూచి మిగుల నానందంబు నొంది జీమూతవాహనుండు తలవని తలంపుగ లభించిన యీయెఱ్ఱవస్త్రంబులచే నాకోరినకోరిక నెఱవేరినది. నాకోరినకోరికకు నీవివాహంబు ననుకూలంబై కన్పట్టెను. అని భుజము లెగురవైచుచుండఁ గంచుకి నమస్కరించి యీయెఱ్ఱబట్టల రెంటిని నాతనిచేతికి నొసంగెను. జీమూతవాహనుం డా రెంటిని సాదరముగఁ బుచ్చుకొని యధికసంతోషముతో ధరియించి యా కంచుకినిం బంపి యిదిగో గరుడుండు వచ్చునట్లున్నది. మలయపర్వతపు గుండ్లు దొరలించుచు వాయువు వీచుచున్నది. దగ్గఱకు వచ్చినట్లు తోఁచుచున్నది. ఇంక నాలసింపరాదు. శంఖ

చూచుండు రాకమునుపే నేఁ గృతార్థుండ నగుమార్గంబుఁ జూచికొనవలయును. ఇంక వధ్యశిల యెక్కెదను" అని దాని నెక్కి కూర్చుండి భయం బించుకేనియుఁ బొరయక, ఆహా! మలయచందనచర్చార్ద్రయగు మలయవతిని నాలింగనంబు గావించిననాఁడును వధ్యశిలను దాఁకిననేటిసుఖంబు గల్గదాయె. మలయవతిమాట యటుండ నిండు. చిఱుతతనంబునఁ దల్లి యూరువులపైఁ బడుచుండి నిశ్చింతగఁ బాలుఁ ద్రాగునాఁడును నిట్టి సుఖం బెఱుంగను. అని మనంబున ఘనంబగు ప్రమోదంబు పొందుచు మైమఱచియుండెను.

అప్పుడు గరుత్మంతుండు తనఱెక్కల విసరుచు పర్వతములను, జెట్లను బెకలింపుచు, సముద్రపునీటిని నెగజిమ్ముచు, తటాలున వచ్చి పైఁబడి జీమూతవాహనుని నెత్తుకొనిపోయెను. ఆకాశమునుండి పువ్వులవాన కురిసెను. సురదుందుభులు మ్రోసె. గరుత్మంతుండును మిగుల నాశ్చర్యంబు నొందుచు వీనిని దీసికొని మలయపర్వతంబునకుఁ బోయి విస్రబ్ధముగ యథేష్టముగ భుజింతుఁగాక. అని జీమూతవాహనునిఁ దీసికొని మలయపర్వతంబునకుఁ బోవుచుండెను.

అంట విశ్వావసువు జీమూతవాహనుఁడు చాలకాలమాలసించినందుకై దిగులొందుచు, సముద్రపుఁబోటును జూడఁ బోయినవాఁ డింతసేపేల యాలసింపవలయును. పోటువేళ

యు నతిక్రమించెను. ఇంతకు రాఁడాయె. ఒకవేళ నక్కడనుండి యల్లతనతల్లిదండ్రులయొద్దకుఁ బోయియుండునేమో? ఎవని నేనిఁ బంపి విచారించెదఁగాక అని యెంచి యొకనిని జీమూతకేతువునాశ్రమమునకుఁ బంపెను. వాఁడా యాశ్రమమునకుఁ బోయి జీమూతకేతువుం గని నమస్కరించి జీమూతవాహనునివృత్తాంతమును దెలిసికొనిరమ్మని మహారాజువిశ్వావసువు మీయొద్దకుఁ బంప నే వచ్చితి నన జీమూతకేతు విట్లనియె. మాయబ్బాయి యక్కడ లేఁడా? ఎక్కడఁ బోయి యుండును? మన కాహారము సంపాదింపఁగడు దవ్వు పోయియుండును. అందుచేత నింత యాలసించుచున్నాఁడు. కాదేని మనలను వదలి యింత యాలసించునే. అని తాను, భార్యయు, గోడలును నాలోచింపఁ దొడఁగిరి. విశ్వావసుకంచుకి "అయ్యా! నా కేమియాజ్ఞ యొసంగెదరు. విశ్వావసువుతో నేమి చెప్పుదు? ఇచట నాలసింపఁదగదు" యని యడుగ జీమూతకేతువు నెడమకన్నదురుటయు, నాతం డిట్లని మనంబున వితర్కింపుచుండె. ఆహా! యేమి యాశ్చర్యము. నాప్రియతనయుఁడు నన్నెడఁబాసి యొక్కక్షణంబైన నుండఁడు. నేఁడేల యింకను రాక యాలసించుచున్నాఁడు. నాకొఱకై రాజ్యంబునుగూడఁ బాసి యడవుల నిడుమలఁ గుడుచుచున్నాఁడు. నాయాహారము నిమిత్తము న్నాకొడుకున కెంతకష్టము వచ్చినది. ఎం దెందుఁ దిరుగుచున్నాఁడో? నాయనా! నాయాహారమునిమిత్తము నీ

కెంతకష్టము వచ్చెను! అని చింతించుచుండ నాకాశమునుండి యనర్ఘరత్నఖచితంబై యనంతకోటిభాస్కరప్రభాభాసితంబైన యొకచూడారత్నం బాతనిముందఱఁ బడెను. "ఆహా! యేమిది తడిమాంసముతోడ నీచూడారత్నం బిటు వచ్చిపడినది. ఇది యెవరిదై యుండును." అని జీమూతకేతు వందఱికిని నా రత్నమును జూపెను. జీమూతవాహనునితల్లి వగమాలిన చిత్తముతో నాచూడామణి నెత్తుకొని, 'మహారాజా! ఈచూడామణి మనపిల్లవానిదానివలె నున్నది. ఆకాశమునుండి యెట్లు పడెను? ఇది చూడ నామనంబు గడుఁ గుందుచున్నది. ఏమి చేయుదు.' అని దుఃఖించుచుండ మలయవతి యూఱడిల్లఁ జేయుచుండెను. కంచుకి వారిమనస్సంభ్రమమును గనుంగొని "మహారాజా! తత్త్వం బెఱుంగక యిట్లధైర్యపడంజనదు. ఇక్కడ గరుత్మంతుఁడు నాగాధిపతులను భక్షించి వారి శిరోరత్నములను బెఱికివేయుట కలదు. అట్టిరత్న మేదియైన నయియుండును. దీని కింత యడల నేల? అని చెప్ప నందఱును నట్టిదై యుండవచ్చు ననుకొని యించుక నెమ్మదిఁ జెందిరి. అంత జీమూతకేతువు గంచుకిని, "జీమూతవాహనుం డింతకు మామగారియింటికే పోయియుండును. త్వరగాఁ బోయి తెలిసికొనిరమ్ము పొమ్ము" అన వాఁడు వారిని వీడ్కొని యరిగెను. వీరందఱును నాచూడామణిని జూచి చూచి "ఇది నాగచూడామణియా? ఆభయంకరస్థానమున మనవానికి నేయాపదయుఁ గలుగకుండుఁ గాక"

దేవునిఁ బ్రార్థింపుచు నింకనుఁ రాఁడాయెఁ గదా యని యతనిరాక కెదురుచూచుచుఁ దహతహపడుచుండిరి.

ఇది యిటు లుండ నచ్చట గోకర్ణేశ్వరునిఁ బ్రదక్షిణంబు గావింపఁ బోయిన శంఖచూడుండు తనవధ్యస్థానమునకు వచ్చి చూచి యచ్చట విద్యాధరచక్రవర్తి జీమూతవాహనుండు లేమికిం గుందుచు నిట్లని విలపింపసాగెను. అయ్యో! నేను గోకర్ణేశ్వరునిఁ బ్రదక్షిణంబుచేసి వచ్చునంతలో విద్యాధరచక్రవర్తిని గరుత్మంతుం డెత్తుకొనిపోయెను. నాకై యతఁ డిట్లు కష్టపుమరణమును బొందవలసివచ్చెను. హా! విద్యాధరచక్రవర్తీ! పరమకారుణిక! నిష్కారణబాంధవా! ఆహా! పరదుఃఖదుఃఖిత! యెక్కడికిఁ బోయితివి. నిను మృత్యువునోటి కందిచ్చి పాఱిపోయిన నాతో నేమి మాటలని మాటలాడవు కాఁబోలు. నే నొక్కపూటకైన గరుడునికి నాహారంబు గాకపోయితి. లోకంబు పొగడ రాజాజ్ఞ నెఱవేర్పనైతి. రాచకార్యం బుజ్జగించిన నాబ్రతుకెందుకు? ఇవ్విధంబు గన్నఁ బ్రజలు నన్నుఁ జావునకు భయపడి యొరుని నప్పగించి గోకర్ణేశ్వరుని దర్శింపఁ బోయితి ననరే? హా! యీయపవాదంబు నే నేవిధంబునఁ బోగొట్టుకొందును. ఇట్లు పరిహాసాస్పదంబైన బ్రతుకు బ్రతుకుటకంటెను గరుడుఁ డెటువోయెనో తెలిసికొని యచ్చటికే పోయి నేను నతనికి నెరగానై కృతార్థతం బడయుటయ కడు లగ్గు. ఇది తప్ప నాకు వేఱొండు పాచితంబు లేదు. అని నిశ్చ

యించుకొని రక్తధారచే గరుడుఁడు పోయిన త్రోవ నెఱింగి వెదకుకొనుచు జీమూతకేతువునాశ్రమమునకు వచ్చుచుండెను. అప్పుడు జీమూతకేతువుభార్య మగనితో నిట్లనియెను.

"నాథా! వీఁడెవ్వఁడు. శోకోద్విగ్నుఁడుంబోలె నెఱ్ఱని మోముతోఁ ద్వరత్వరగా నీవైపునకే వచ్చుచున్నాఁడు. వీనిఁ జూడ నాహృదయము దిగులొందుచున్నది. వీఁ డెవఁడో తెలిసికొందము. అన జీమూతకేతు విట్లనియెను. వాస్తవముగ నీచూడామణి యితనిదే యయియుండును. దానిని వెదకుచు నిచ్చటికి వచ్చుచున్నాఁడు. ఇంతదనుక మనవాని దనుకొంటిమి. మనవానిది కాదు. మీరు ధైర్య మూనుఁడు. అని భార్యకును గోడలికిని ధైర్యము చెప్పి యూఱడించుచుండెను.

ఇంతలో శంఖచూడుండును నచ్చటికి వచ్చెను. జీమూతకేతు వాతనిం జూచి యేమి సమాచార మని యడుగ నా శంఖచూడుం డిట్లని చెప్పనారంభించెను. "ఎట్లు చెప్పుదు. పొరలి పొరలివచ్చు దుఃఖమునను, కన్నీళ్లచేఁ గలిగిన గొంతడపుచేతను జెప్పవలె నన్నను నాలుకాడకయున్నది. ఏట్లును జెప్పకతీరదు. అందఱును వినుఁడు. నే నొక నాగకుమారుండ. నన్ను శంఖచూడుం డందురు. తొల్లి చేసికొనిననియమప్రకారము మాఱేఁడు నన్ను గరుత్మంతునికి నేఁ డాహారముగాఁ బంపినాఁడు. పెక్కేల. ఈ నెత్తురు మాశరు గాఁబోలు. ఇదియు గాలిచే రేఁగిన యిసుకచే

మాసిపోయినది. అట్లు గరుడుని కాహారముగఁ బంపఁబడిన నన్నొక విద్యాధరుఁడు దనదేహము నా గరుత్మంతుని కిచ్చి నాప్రాణములఁ గాపాడినాఁడు. ఇట్టి యద్భుతంబు మున్నెన్నఁడు గన్నదియు విన్నదియుఁ గాదు. స్వార్థపరంబైన యీప్రపంచంబున నీతం డొక్కరుండే పరోపకారధురీణుండు. పరోపకారపారీణత నీతనిం జెప్పి మఱొక్కనిం జెప్పవలయు" నని చెప్పుట తడవుగా జీమూతకేతువు నతని భార్యయు, మలయవతియు నందఱు "అట్టి పరహితపరాయణుండు జీమూతవాహనుండు తక్క వేఱొక్కరుండు గాఁడని నిశ్చయించి మిక్కిలి విలపించి యపారంబగు నాదురంతసంతాపంబు నోర్వఁజాలక మూర్ఛఁ బొందిరి.

శంఖచూడుండు కన్నీరు మున్నీరై కాఱ విలపించి "నిక్కముగ వీ రామహాత్మునితల్లిదండ్రులు. ఈ పసిచిన్నది యాతనిభార్యయై యుండును. అతిదుఃఖకరంబైన నీవార్తఁ జెప్పి వీరిని శోకసాగరంబున ముంచితి. విషధరుండైన నానోటినుండి విషంబుతప్ప మఱేమి వచ్చును. అయ్యో! నాప్రాణంబునకుఁ దనప్రాణం బర్పించి యుపకారంబు గావించినజీమూతవాహనునికి నే నెట్టి యుపకారంబు చేసితి. కృతఘ్నుండ నగు నేను భూమిపై నుండి మనుటకంటెఁ జచ్చుట శ్రేయంబు. ఆత్మహత్యచేఁ బ్రాణంబు దొలంగుద మన్న నయ్యది పాపహేతువు. ఇఁక నే నేమిట నసువులఁ బాయుదు. వీరిని నోదార్చి చూతునుగాక. అని వారిని పెక్కుభంగుల

నూఱడించెనుగాని పుత్రశోకం బగ్గలంబగుటు నెంత యూ
ఱడించినను నూఱడిలక యచ్చటఁ బడియున్న చూడామణిని
నెత్తుకొని హృదయముపైఁ బెట్టుకొనుచుఁ గన్నుల నొత్తుకొ
నుచు జీమూతవాహనునిసుగుణంబులం దలంచుకొని
వగలం బొగులుచు నెంతయోసేపు విలపించిరి. ఆతని
గుణంబులు తలంపఁదలంప, దుఃఖం బపారం బగుటు నా
దుఃఖం బోర్వఁజాలక యంద ఱొక్కమొగి యగ్నింబడి ప్రా
ణముల విడువ నిశ్చయము చేసికొనిరి.

అంత శంఖచూడుఁడు కటకటా! ఏమిఁ జేయుదును. నా
యొక్కనినిమిత్త మీ విద్యాధరకులం బెల్ల నాశంబు నొంద
నున్నదే. దీనిం దప్పించునుపాయం బెద్ది? ఇటుల సెప్పి
చూపెద. అని యోజించి జీమూతకేతువుతో నిట్లనియె.

"ఆర్యవర్యా! కరంబు విచారింపక తొందరపడి యేపని
యుఁ జేయరాదు. సహసా విదధీత నక్రియామ్." అని పెద్దలు
చెప్పుదురు. దైవవిలసితంబులు గడువిచిత్రంబులు. ఒకవేళ
నాగరుడుఁ డావిద్యాధరుని నాగుండు కాఁడని యెఱింగి
తినక విడిచినను విడుచును. ఆగరుడుని వెదకుదము రండు.
అని చెప్ప జీమూతకేతువును నతనిభార్యయు, మలయ
వతియు నందఱును శంఖచూడుని ముం దిడుకొని గరుడుని
వెదకుటకు బయలుదేరిరి.

అఁట జీమూతవాహనుని నెత్తుకొని మలయపర్వతము
నకుఁ బోయినగరుత్మంతుఁడు తనమనంబున నిట్లని విత

ర్కింపఁ దొణంగెను. "ఆహా! ఏమి యీయాశ్చర్యము.
పుట్టువుదొట్టి యెందఱనో పాపజేల మెసవియున్నవాఁ
డను. ఇట్టి యద్భుతంబు నెన్నఁడు గని యెఱుఁగ. ఈ మహా
త్ముండేమొకాని యించుకేనియు భయంబుఁ బొందకుండమి
యటుండఁ గడు సంతసంబుం గూడఁ బొందుచున్నాఁడు. నేఁ
డారసింప నెవ్వఁడును బ్రాణములఁ బిడికిటం బట్టుకొని యుం
డువాఁడు. ఇంత ధైర్యం బూనియున్నవాని నింతకుఁ బూర్వ
మెన్నఁడును జూచి యెఱుంగ. నాకు నెంత నల్ల ద్రావినను
తనివి యొదవదు. నేఁడేమొకో యెఱుంగ. ఈమహాత్మునినల్ల
నించుక పీల్చుడుఁ గడుపు నిండి త్రేపులు వచ్చుచున్నవి.
నేను మాంసమొలుచునప్పుడు నెవ్వండును డిల్లఁబడి మోము
వెలవెలపాఱఁ గత్తివాటు వేసినను నొసట నెత్తురు బొట్టురాక
యుండెడివాఁడు. ఇతం డట్లు కాక గడుఁ బ్రీతిఁ బ్రసన్నవద
నారవిందుఁ డయి యున్నవాఁడు. శరీరకాంతి కొంచెమేని
యుం దగ్గదు. అంగము సంజాతపులకమయి యలరెడిని.
మిఁగుల నపకారంబు గావించిన నన్ను మహోపకారంబు
గావించిన ధర్మాత్మునిం జూచినట్టు శీతలార్ద్రంబు లగు చూ
పులఁ జూచుచున్నవాఁడు. ఆహా! యేమి యీతని ధైర్య
వృత్తి. ఈతనిఁ జూడ నాకుఁ గడు సంతసం బయ్యెడి. భక్షింత
తమన్న బుద్ధి పుట్టకయున్నది. ఈతం డెవ్వండో యెఱుంగు
నంతకు భక్షింపక యుండెదను. అని తినక యూరక విడి
చెను.

జీమూతవాహనుం డిట్లనియె. అయ్యా! గరుత్మంతా! ఏల తినుట మానితివి? నామాంసంబు రుచిగ లేదా? మేన నింకను నల్లగొల్లగ నున్నదే. యథేచ్ఛముగఁ ద్రాగుము. శరీరమున నింకను మాంసము మెండుగ నున్నదే? నీమోము తిలకింపఁ దనివిఁ జెందినట్లు తోఁచుచున్నది. నే నధైర్యము పడుదు నని మానితివా? నీవు తినకున్న నధైర్యము కాని తినుచున్నఁగాదు. అందఱిశరీరంబురక్తంబుఁబోలె నా శరీరంబు రక్తంబు రుచ్యంబు గాదు కాఁబోలు. నీకాహారమై పుణ్యంబు గాంచ నే దొలిపుట్టువున నెట్టినోములు నోచితినో? నాపై దయ యుంచి కడుపార భుజించి నన్ను ధన్యుం గావింపుము. తనశరీరంబు నొరునికి నాహారంబుగా నొనరించుటకంటెఁ బుణ్యం బెద్ది. ఏల యాలసించెదవు. వడివడిగ భుజింపుము. అని మఱిమఱి వేఁడికొన నాగరుత్మంతుఁ డిట్లనియె. అయ్యా! నాయెదుట ధైర్య మూని మాటలాడినవానినిఁ జూచి యెఱుఁగ. నిన్నుఁ జూడ మిగుల నచ్చెరువు వొడమెడు. ఇట్టియవస్థం గూడ నిట్లూర్జితంబుగ మాటలాడుచున్నాఁడవు. నీ వెవ్వఁడవు. నీనామధేయం బేమి? విన వేడుకపడి యడిగెదను. వినిపింపుము. అన జీమూతవాహనుం డిట్లనియె.

అయ్యా! విష్ణురథా! నే నెవ్వండ నైననేమి? నాసమాచారంబుతో నేమి ప్రయోజనంబు. నీ వాఁకలిచే బాధపడుచున్నావు. వినఁదగిన స్థితిలో లేవు. ముందు నారక్తమాంసము

లచేఁ దృప్తి చేసికొమ్ము. పిదపఁ జూచికొందము. అని చెప్పుచుండ జీమూతకేతువు మొదలగువారితోడ గరుడుని వెదకుచువచ్చిన శంఖచూడుం డచ్చటికిఁ దటాలునవచ్చి జీమూతవాహనునిఁ బట్టుకొనియున్న గరుత్మంతుని నివ్వెఱపడి చూచుచు "అయ్యా! తార్క్ష్య! వదలు వదలు. సాహసము చేయకుము. నీవు భక్షించునీతండు నాగకుమారుఁడు గాఁడు. ఈతని వదలి నన్ను భక్షింపుము. వాసుకిచేత నీ కాహారముగఁ బంపఁబడినవాఁడను నేను గాని యీతఁడుగాఁడు." అని పెద్దపెట్టున కేకలు వేయుచుఁ దనఱొమ్మును గరుత్మంతునిముందర పెట్టి తిను తినుమని తొందరపెట్టసాగెను.

జీమూతవాహనుం డది చూచి యిట్లని తలంచెను. అయ్యో! యీశంఖచూడుఁడు వచ్చుటఁబట్టి నాకోరిక విఫలం బాయె. ఇంకఁ గొంచెముసేపు రాకుండిన నేఁ గృతార్థుండ నగుదునుగదా? ఎన్నిదినంబులనుండియో కోరుచుండిన నాకోరిక కొనసాగెఁగదా యని సంతోషించుచుంటినే. ఇం కొక్క నిమిషము రాకున్న నాజన్మము సాఫల్యంబుఁ గాంచుఁగదా? అని తలంచుచుండ గరుత్మంతుఁ డా యిద్దఱినిఁ జూచి 'యాశ్చర్యములో నాశ్చర్యముగ నున్నది. వీరిద్దఱును వధ్యచిహ్నమును దాల్చియున్నారు. ఇం దెవఁడు నాగకుమారుండో యెఱుంగఁజాలకున్నవాఁడ' అని యాలోచించి శంఖచూడునిఁ జూచి, యిట్లనియెను. మీయిరువురిలో నాగుం డెవ్వఁడో యెఱుంగఁజాలకున్నాఁడ. అన శంఖచూడుఁ డిట్లనియె.

గరుత్మంతా! నీకు నీ భ్రమ గల్గుట యుక్తము. ఱొమ్మున మచ్చ లుండుటంబట్టి యిట్లు భ్రాంతిఁ బొందితివి గాఁబోలు. నాకు మేన గుబుస మున్నదే. దీనినైనఁ జూచి గుఱుతు పట్టఁగూడదా? రెండునాలుకలైనఁ జూడవా? విషాగ్నుల నుమియు నాఫూత్కారంబు లయిన నెఱుకపడవా? ఏల యిటు తొందరపడితివి. నావుడు గరుడుఁ డిట్లనియెను. 'అయ్యో! నేను భక్షించినవాఁ డెవ్వం' డని యడుగ శంఖచూడుఁ డిట్లనియె. ఇతండు విద్యాధరవంశతిలకుం డగుజీమూతవాహనుఁడు. ఇసుమంతయైన దయ పూనక యిట్టియకృత్యంబు గావించితివి. అన గరుడుం డామాట విని అక్కటా! 'యనారతము నే వినుచున్న సత్కీర్తిగల విద్యాధరకుమారుఁ డగు జీమూతవాహనుఁడా యితఁడు! ఎంతపాపంబు కట్టుకొంటిని. నాకు భోజ్యంబైన పామును గాపాడఁ దనప్రాణంబుల నొసంగిన మహాదయాళువే! ఇట్టి బోధితసత్యునిం జంపితినే. ఇట్టి నా తెలివిమాలినతనంబున కే మనుకొందును. "ఆత్రగానికి బుద్ధి మట్టు" అన్నట్టు క్షుధాతురుండైన నాకుఁ దెలివి యేల యుండును. ఈపాపంబును నగ్నిహోత్రంబునఁ బడియైనఁ బాసికొందునుగాక. ఇచ్చట నా కెక్కడ నగ్ని దొరకును." అని దిక్కులు చూచుచుండ జీమూతకేతువు సకుటుంబముగ నగ్నిహోత్రంబులతోడ నచ్చటికి వచ్చుచుండుట గని గరుత్మంతుఁడు మనంబున సంతోషపడుచుండె. తల్లిదండ్రులు వచ్చుచున్నా రన్నవార్త శంఖచూడుఁడు చెప్ప విని జీమూతవాహనుం డిట్లనియె. శంఖచూడా! చక్కఁగ లేవ నెత్తి కూర్చుండఁబెట్టి యీయుత్తరీయముతోఁ గప్పి ననుఁ

బట్టుకొని కూర్చుండుము. ఇట్టిస్థితిలో నున్ననన్నుఁ జూచిన నాతల్లిదండ్రులు ప్రాణములు వదలినను వదలుదురు. తల్లిదండ్రులకంటఁబడకుండఁ జేయుము." అన శంఖచూడుం డట్ల యొనర్చె.

జీమూతకేతువు కొడుకుం దలంచుకొని కన్నీళ్లు నించి హాతండ్రీ! జీమూతవాహనా! నీవు దనవాఁడు పెఱవాఁడను భేదం బించుకేనియుఁ దలంచువాడవు కావె! ఎల్లప్పుడు నొక్కనినో పెక్కుఱనో కాపాడ మనంబునఁ దలంచు మహాకారుణికుండవే? అట్టి నీవు నేఁ డీ పామును గరుత్మంతునినుండి రక్షింప నెంచి నీదేహము నర్పించి నీతలిదండ్రులను భార్యను ముగ్గురిని జంపికొంటివే! కులంబెల్ల నిశ్శేషంబు గావించుకొంటివే! మేము నిన్నుఁ గనుగొనక బ్రదుకఁగలమా! నాకు జీవగఱ్ఱయై యుంటివే! అంధులకు నూఁతకోలగ నుందు వనుకొంటినే. అని మిక్కిలి దీనతతో విలపించుచుండ భార్యయుఁ దల్లియు రోదనము చేయుచుండిరి. గరుత్మంతుఁ డది విని 'పుత్ర! జీమూతవాహనా!' అని యనుచున్న వీరు నిక్కముగ నీతనితలిదండ్రులే. ఇతఁడు వేల్చెడు నగ్నిలోఁ బడి ప్రాణములు విడుతునన్న వీరిపుత్రుని ప్రాణములఁ గొన్న నేను సిగ్గు లేక వీరిమొగ మెట్లు చూతును. వీరియగ్నితో నామే నెట్లు దహించుకొందును. అగ్నికై యింత విచారమేల? సముద్రమున కరిగి బడబాగ్నిచే దహించుకొందునుగాక. అని యనుచుండ జీమూతవాహనుం డిట్లనియె.

ఓ పక్షిఱేఁడా! అగ్నిలోఁ బడినమాత్రంబుచే నీపాపము పోవుననుకొంటివి కాఁబోలు నీపాపంబున కిది ప్రతీ

కారంబుగాదు. అన గరుత్మంతుం డతని కాళ్లపై నిలిచి చేతులు దోయిలించుకొని, మహానుభావా! ఆయుపాయం బేదియో చెప్పుము". అని యడుగుటయు జీమూతవాహనుఁడు "క్షణ మోర్చుకొనుము. నా తల్లిదండ్రులు వచ్చియున్నారు. వారికి నమస్కారముచేసి మఱి చెప్పెదను." అని యనుచుండ నింతలో జీమూతకేతువు మొదలగువా రచ్చటికి వచ్చి జీమూతవాహనుని జూచి బ్రతికియున్నాఁడని మనంబున సంతోషపడుచుండిరి.

జీమూతవాహనుండు తల్లిదండ్రులకు నమస్కారము చేయ లేనఁబోయి యుత్తరీయము జారిపడిపోవ మూర్ఛితుండాయె. అది కని తల్లియుఁ దండ్రియు భార్యయు నందఱు నొక్కపెట్టున మూర్ఛపోయిరి. వీని కంతటికిని మూలము నేను గదా యని శంఖచూడుండు తన్నుఁ దా నిందించుకొనుచు దుఃఖించుచుండెను. గరుత్మంతుండు 'నాయొక్క యవిమృశ్యకారిత్వమునఁ గదా యింత ఱిట్లు దుఃఖింపవలసి వచ్చె. ఏమి చేయుదును.' అనుచు తన ఱెక్కలచే విసరి జీమూతవాహనుని మూర్ఛనుండి తెప్పిఱిల్లఁ జేసెను. ఆతండు తెప్పిఱిల్లి తల్లిదండ్రుల నూరడింప శంఖచూడుని నియోగింప శంఖచూడుడు తల్లిదండ్రులను మలయవతిని బహుభంగుల నూరడింప నందఱు నెట్టకేలకు నూఱడిల్లిరి. జీమూతవాహనునితల్లి జీమూతవాహనుని మేను నిమురుచు గరుడుని నుద్దేశించి యిట్లనియె.

'అయ్యో! ఇపుడిపుడె యంకురితయౌవనుండగు నా కొమారుని శరీరం బిట్టి యవస్థకుం బాల్పఱుప నీమన సెట్లొ

ప్పెను. నిర్దయుఁడా! కడు వృద్ధుల మముఁ దలంచియైన నీ సాహసము మానవైతిగా. అకటా! ఒక్కకొడుకును నీపాట్టం బెట్టికొంటివే!' అని దూఱుచుండ జీమూతవాహనుండు తల్లి కిట్లనియె.

"అమ్మా! ఇతఁ డేమి చేసినాఁడు. ఊరక యితని నేల దూషించెదవు. నే నీ శరీరమును పరోపకారంబునకే భరించుచున్నానని నీవెఱుంగవే. అది నేఁడు లభించినది. దీనికి వగవ నేల? దీన నాకుఁ బరమలాభంబు గల్గియుండ నీతనిని దూషింప నేల? ఊరకుండుము." అని చెప్పుచుండెను. గరుత్మంతుఁడు, జీమూతవాహనుడు తనపాపము పాపికొనుటకు నేవిధమగు నుపాయంబుఁ జెప్పునో దానిని నాచరించి శీఘ్రంబుగాఁ బోఁగొట్టుకొనఁ దలంచి యట్టి యుపాయంబు చెప్పుమని వేడ జీమూతవాహనుం డిట్లనియె.

"విష్ణురథా! నన్నుఁ జంపఁ బ్రయత్నించుట పాపంబని తలంపను. నీవు ప్రతిదినము సర్పములఁ జంపుటయే మహాపాపంబు. ఇట్టి పాపంబునకు హింస విడనాడుటయె మహాప్రాయశ్చిత్తంబు. ఇది తప్ప వేఱొండు ప్రాయశ్చిత్తము లేదు. నేఁడుమొదలు హింస వదలుము. మును చేసిన పాపంబునకై మనంబునఁ బశ్చాత్తాపంబు నొందుము. ఎల్లప్రాణులయందును దయ నెఱపుము. ఇయ్యది యొనర్చిన నీపాపం బంతయుఁ బటాపంచలైపోయి విత్తుచెడి మీఁదటికాలంబున నీకు మేలు గలుగును." అని చెప్ప నిట్టి మహోపదేశంబు గావించినందులకై కడు సంతసించుచు "మహాత్మా! యజ్ఞానతమోంధుఁడనై కన్నుఁ గానక పాపంబున మునింగి

యున్న నన్ను దయచేఁ గన్నుదెఱపించి కృతార్థునిం గావించితివి. భవదీయోపదేశంబున నామనంబు నిర్మలంబాయె. ఇదిమొదలు ప్రాణివధ వదలితిని. నిక్కముగ వదలితిని. మూఁటికి ముమ్మాటికి వదలితిని. నాగులజోలికిఁ బోను. సర్పంబు లింక యథేష్టంబుగఁ దిరుగవచ్చును. పరోపకారధురీణుండవగు నీకీర్తి యెల్లలోకంబుల నాగాంగనలు వీణాగానం బొనర్తురుగాత. అని స్తోత్రంబు చేయుచుండెను.

జీమూతవాహనుండును, 'ఆతఁ డట్లు నాగభక్షణంబు వదలితి నని ప్రతిన పట్టినందులకై చాల సంతోషించి యభినందించి శంఖచూడునితట్టు చూచి, నీ విఁక నింటికిఁ బొమ్ము. ఇంతకు నీతల్లి నిన్ను గరుడుఁ డొలుచున్నవాఁడని మదిఁ దలంచితలంచి యధికమగుచున్న దుఃఖాతిశయమును సైపఁజాలక చచ్చినట్లు పడియుండును. శీఘ్రంబుగఁ బోయి యామె నోదార్పుము. పొమ్ము. అన శంఖచూడుఁ డేమి చేయుటకును దోఁపక మోము వాంచి నిలువఁబడియుండెను.

ఇంతవఱకు జీమూతవాహనునికిఁ బరార్థసంపాదనరసపారవశ్యంబున మరణవేదన యెఱుంగసడలేదుగాని ఘడి తుదముట్టుడు బాధ యెక్కువఁ గాసాగెను. తల్లిదండ్రులకు నమస్కరించుటకై చేతులు జోడించుకొనుటకైనను శక్తి చాలక శంఖచూడునిచేతులుజోడింపుమని యడుగ నతఁడట్లు చేతులు జోడింపఁగా జీమూతవాహనుఁడు తల్లిదండ్రులను బిలిచి, అమ్మా! నాయనా! నానమస్కారమిదె గైకొనుఁడు! నాకుఁ దెలివి దప్పుచున్నది. చెవులు వినరావు.

కనులు మూఁతలు పడుచున్నవి. ప్రాణములు పోవుచున్నవి. నే నీబాధ యోర్వఁజాలను. ఇవియే నాకడపటివందనములు. రాఁబోవుజన్మమునందును మీరే తల్లిదండ్రులు గావలయునని విలపించుచు నాబాధచే మేను దొఱంగెను. జీమూతకేతువు, అతనిభార్యయు, కోడలుమలయవతియు నందఱు నొక్కపెట్టున హాహాకారంబు లెసంగ ఱొమ్ము లప్పళించుకొనుచు బాహువులు పైకెత్తి యేడ్వసాగిరి. నావలనం గాదే వీరందఱకిట్టి దుఃఖంబు సంప్రాప్తం బయ్యె నని గరుత్మంతుఁడును నేను గదా దీని కంతటికిని గారకుండ నని శంఖచూడుండును పెద్దపెట్టున రోదనము చేయుచుండిరి.

ఇతండు మృతుం డయ్యెనే! ఏమిచేయుదును. అని గరుత్మంతుఁ డాలోచించుచుండ జీమూతకేతువు పుత్రశోకంబు నణఁపఁజాలక గొంతెత్తి యేడ్చుచుఁ బైనఁ జూచి 'అకటా! లోకపాలకులారా! దేవతలారా! అమృతవర్షమునైనఁ గురిపించి నాపుత్రుని బ్రతికించి పుత్రదానంబుచేసి మా కూర్ధ్వగతిఁ గల్పించి పుణ్యంబు గట్టుకొనరుగా. "అపుత్రస్య గతిర్నాస్తి" అన వినరే' యని విలపించెను. ఆమాట విన్న గరుత్మంతుఁడు, "సమయమునకు జ్ఞప్తికి వచ్చినది. ఉపకారంబొనర్చినవారికిఁ బ్రత్యుపకారము చేయ నిప్పుడ కంటిని. ఇంద్రునిఁ బ్రార్థించి యమృతమును సాధించి తెచ్చి జీమూతవాహనుని బ్రతికించెదను. ఇంతియకాక నాచే భక్షింపఁబడి యెముకలై పడియున్న నాగులను గూడ బ్రతికించెదను. మంచియుపాయంబుఁ దోఁపఁజేసి వీరి కోరికలు నాకు మహోపకారము గావించె. సత్వరముగఁ

బోయెద" అని యత్యుత్సాహంబున మహాసంరంభముతో స్వర్గలోకంబున కరిగెను.

ఇచట జీమూతకేతువు పుత్రశోకం బోర్వఁజాలక దుఃఖాతిశయంబున భూమిపైఁ బడి పొరలి పొరలి యేడ్చుచు త్రెంచివైచిన లేఁదీఁగవిధంబున భర్తృవియోగంబునఁ గన్నీరు మున్నీరు గా నేడ్చుకోడలిని పుత్రదుఃఖాతురయయి విలపించుతనభార్యను నూరడించి ప్రయోజనంబు గానక జీమూతవాహనుఁడు లేక బ్రతుకఁజాలమనుకొని కొడుకుచితిలోఁబడి తామును ప్రాణములు విడువందలఁచి శంఖచూడుచేఁ జితి పేర్పించి దానిపై జీమూతకేతువు నునిచి ఇంకెందు కాలస్యము? లెండు. అందఱము నీచితిలోఁబడి ప్రాణముల విడుతము. అని భార్యను గోడలు మలయవతిని బిలిచికొని చితిదగ్గఱకుఁ బోయెను.

అప్పుడు మలయవతి గోడుగోడున నేడ్చుచుఁ జేతులు జోడించుకొని గౌరీదేవి నిట్లు స్తుతింపఁదొణఁగెను. "అమ్మా! గౌరీ! నాపై నిటు నిర్దయత్వము పూనఁదగునా? విద్యాధరచక్రవర్తి నీకు భర్తకాఁగలఁడని చెప్పితివే. నీమాటయుఁగల్లయాయెనే. నీమాట యేనాఁడు నబద్ధము కాదు. నేఁడు నా దౌర్భాగ్యంబు కతంబున నబద్ధం బయ్యె. నాయదృష్టమిట్లుండ నిన్నేమందును." అని స్తుతింప గౌరీదేవి కృపాతరంగితాంతరంగయై తటాలున 'జీమూతకేతువా! సాహసము వలదు వలదు మలయవతీ! వత్సా! నామాట యబద్ధము కాదు. నిజమనినమ్ము.' అని చెప్పుచుఁ బ్రత్యక్షమై జీమూతవాహనుని యొద్దకుఁ బోయి తనకమండలువులోని

యుదకము నాతనిపైఁ జిలకరించి 'వత్సా! జగంబుహితంబు పొంటె నిరాయాసంబుగ గడ్డిపరకవలెఁ బ్రాణముల నర్పించిన నిన్ను మెచ్చుకొంటిని. కడు సంతసించితిని. లెమ్ము. అని చెప్ప జీమూతవాహనుండు నిద్రపోయి మేల్కాన్నవానిమాడ్కిఁ జివాలున లేచి కూర్చుండెను.

జీమూతవాహనుండు మొదలగువా రత్యాశ్చర్యప్రమోదరసమగ్నులై సంతసంబున మునింగి వితాకుపడి చూచుచుండిరి. జీమూతవాహనుండు లేచి గౌరికి నమస్కరించి స్తుతించుచుండెను. జీమూతకేతు వీ యాశ్చర్యంబు దెలియఁగోరి గౌరికి నమస్కరించి 'అమ్మా! ఇట్లు మబ్బులేని వర్షము వచ్చుటకు గతంబేమి! ఇది నీమాయయే. అన తియవలయును' అని యడుగ గౌరి యిట్లనియె. జీమూతకేతూ! నీతనయుం డగుజీమూతవాహనుని బ్రకించుటకును నెముకలై పడియున్న నాగపతుల సంరక్షించుటకును గరుత్మంతుఁడు స్వర్గలోకంబునకుఁ బోయి యింద్రునిఁ బ్రార్థించి యమృతంబు దెచ్చి వర్షంబు గురిపించెను. ఆయమృతవర్షంబుచేత జీమూతవాహనుండును నాగపతులును బ్రదికిరి. అదిగో అటుచూడుము. నాగపతు లత్యుల్లాసంబునఁ బొదలుచున్నవి. అని చెప్ప నందఱును గరుత్మంతునియౌదార్యంబునకు మనంబునఁ గడు సంతసింపుచుండిరి. ఎముకలయి పడియున్న సర్పము లన్నియుఁ బ్రతికి సంతోషమునఁ బొదలుచుఁ దనివి దీఱ నమృతమును రెండునాలుకలతోను ద్రాగుచు సముద్రమునఁ బడిపోయెను.

అంత పార్వతి జీమూతవాహనుఁ డొనర్చిన సాహసం

బున కది చాల వని విద్యాధరచక్రవర్తిపదం బొసంగి యం దభిషేకించి బంగారుచక్రములు గలరథమును, చతుర్దంతదంతావళమును, దెల్లగుఱ్ఱమును నొసంగి, మలయవతి యెప్పుడతని నెడఁ బాయకుండునట్లు వరం బొసంగి యింకేమి కోరెదవని జీమూతవాహనుని నడుగ నతఁ డామె కిట్లనియె. 'అమ్మా! నీయనుగ్రహముచే శంఖచూడుఁడు జీవించె. ఎన్నిదినంబులనుండియో చచ్చిపడియుండిన సర్పముల యెముక లన్నియు జీవించి శరీరములఁ దాల్చి యథేచ్ఛం జరించుచున్నవి. గరుడుఁడు జీవహింస మానినవాఁడు. నేను లేనిసమయమున నామంత్రిఁ ద్రోసి నారాజ్యము గొనినమాతంగహతకుఁడును దనకుఁ దాన నశుం డాయెను. అనన్యదుర్లభం బైననీదర్శనంబు లభించెను. సర్వము సముపసన్నం బయ్యె! నా కేకొఱంతయు లేదు. అయినను నొకటి యర్థించెద. నామనం బెప్పుడు పరోపకారపరాయణ మగునట్లు దయచేయుము. నాప్రజలు ధర్మాచరణతత్పరు లగునట్లును నాకు నీపై నిరంరతము భక్తి యుండునట్లును నాదేశంబున పుణ్యాత్ములు సదా వాసంబు సేయుచుండునట్లును నాకును నాప్రజలకును నపార సౌఖ్యం బొదవునట్లును వరం బొసంగుము.' అనఁ బార్వతి 'యట్లగుంగాక' యని వరం బొసంగి యంతర్ధానంబు నొందె.

అంత జీమూతవాహనుం డనేకదివ్యసంవత్సరములు విద్యాధరచక్రవర్తియై మలయవతితోడ నిస్సపత్నముగ విద్యాధరుల నేలుచు సుఖం బుండె. శ్రీ. శ్రీ. శ్రీ.

Printed at the Sadananda Nilaya Press, Choolai, Madras—1915.

END OF
TITLE